
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత బుధవారం గరిష్ఠం : 28.0 కనిష్ఠం : 23.0

ANDHRAJYOTHY 5



శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

గురువారం 24 జూలై 2025

కల్యాణ శ్రావణం

రేపటి నుంచి శుభకార్యాల మాసం



ధర్మవరంలో ముస్తాబైన పెళ్లి మండపం



బలమైన ముహూర్తాలు

శ్రావణ మాసం అంతా శుభ కార్యాలకు బలమైన ముహూర్తాలు న్నాయి. వాటిలో ఈనెల 26, 31, ఆగస్టు 9 తేదీల్లో జిల్లావ్యాప్తంగా వందలాది వివాహాలు జరగనున్నాయి. గృహ ప్రవేశాలకు ఈనెల 30తోపాటు ఆగస్టు 3, 9 తేదీలలో అనువైన ముహూర్తాలు ఉన్నాయి. జూలైలో 26, 30, 31, ఆగస్టులో 1, 3, 5, 7, 8, 10, 11, 12, 13, 14, 17 శుభ ముహూర్తాలున్నాయి. ఆయా తేదీల్లో పెద్ద సంఖ్యలో వివాహాలు జరగనున్నాయి.

ధర్మవరం/అనంతపురం టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): శుభకార్యాల మాసం శ్రావణం వచ్చేస్తోంది. వివాహాలకు తెరలేచింది. గత జ్యేష్ఠ, ఆషాఢ మాసాల్లో శుభ ముహూర్తాలే లేవు. శుభకార్యాలే లేవు. దీంతో శ్రావణ మాసం కోసం ఎదురుచూస్తున్నారు. నెలంతా బలమైన ముహూర్తాలు ఉండడంతో భారీగా శుభ కార్యాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. భారీగా వివాహాలు చేయనున్నారు. దీంతో ఇప్పటికే కల్యాణ మండపాలు, వాహనాలు బుకింగ్ అయిపోయాయి. వివాహాలు చేయించే పురోహితులు కూడా బిజీ అయిపోయారు. నెలంతా క్షణం కూడా తీరిక ఉండదని వారు చెబుతున్నారు. వివాహాలకు తోడు వరలక్ష్మీ వ్రతం, వివిధ పర్వదినాలు ఉండడంతో మార్కెట్‌లో కొనుగోళ్లు ఊపందుకోనున్నాయి. వస్త్రాలు, బంగారం విక్రయాలు ఇప్పటికే పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు.

ఖర్చుకు తగ్గేదే లే..

కొన్నేళ్లుగా జిల్లాలో పెళ్లిళ్ల ట్రెండ్ మారిపోయింది. చిన్నగా పెళ్లి చేయాలన్నా రూ.10లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. బడాబాబులు ఖర్చులకు అంతేలేదు. మధ్యతరగతి వారు కూడా స్థోమతకు తగ్గట్టుగా పెళ్లిళ్లు చేస్తున్నారు. దీంతో ఊరేగింపు, మెహందీ, వీడియో, లైటింగ్, భోజనాలు, (మిగతా 6లో..)

వేల సంఖ్యలో వివాహాలకు ఏర్పాట్లు

కల్యాణ మండపాలు, వాహనాల బుకింగ్

పురోహితులూ బిజీ

ఊపందుకోనున్న వ్యాపారాలు

చెట్టు దిగి.. కొండెక్కిన టెంకాయ..!

6



- ఒక్కో కాయ రూ.60
- నెల వ్యవధిలో రూ.20 పెరిగిన ధర
- కర్ణాటక, తమిళనాడు నుంచి దిగుమతి
- శ్రావణంలో భక్తులకు భారం తప్పదా..?



అలంకరణలో శనీశ్వరుడు

పావగడలో ఉత్సవ శోభ

6

- 26 నుంచి శ్రావణమాస వేడుకలు
- ముస్తాబైన బంగారు శనీశ్వరుడు



ఉత్సవాలకు ముస్తాబైన శనీశ్వర ఆలయ ప్రాంగణం

నిధులివ్వకుంటే.. పనులెలా?

మండల మీట్‌లో నిలదీసిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

సమావేశాన్ని బహిష్కరించి.. నిరసన

ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓతో వాగ్వాదం



సమావేశాన్ని బహిష్కరించి, కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

ధర్మవరం రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): నిధులివ్వకుంటే గ్రామాల్లో పనులెలా చేయాలంటూ మండల అధికారులను సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నిలదీశారు. తమకు గౌరవ వేతనాలు కూడా ఇవ్వకుంటే ఎలాగని మండిపడ్డారు. తమ వినతులను పట్టించుకోనపుడు సమావేశాలు ఎందుకు అంటూ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు.. మండల సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించి, కార్యాలయం ముందు నిరసన చేశారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ రమాదేవి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సమావేశానికి వచ్చీరాగానే తమ సమస్యలు ఒక్కటి కూడా పరిష్కరించరంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల తీరుకు నిరసనగా సమావేశాన్ని బహిష్కరించి, బయటకు వచ్చారు. గంటపాటు బయటే ఉండిపోయారు. వారి వద్దకు డిప్యూటీ ఎంపీడీఓ వెంకటేష్ వచ్చి మాట్లాడారు. అయినా వారు ససేమిరా అనడంతో ఎంపీడీఓ సాయిమనోహర్ వచ్చి వారితో మాట్లాడారు. కనీసం వీధిలైట్లు వేయాలన్నా.. నిధుల్లేవనీ, తమను ప్రజల వద్ద చులకన చేస్తున్నారని వాపోయారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేస్తామనీ, సమస్యలుంటే సమావేశంలో అడగాలని తెలిపారు. దీంతో వారు సమావేశానికి వచ్చారు. పలు శాఖల అధికారులు చేపడుతున్న కార్యక్రమాలు, అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో ఏఓ ముస్తఫా, వైద్యాధికారి పుష్పలత, ట్రాన్స్‌కో ఏఈ జానకీరామయ్య, హౌసింగ్ ఏఈ భార్గవి, ఏపీఎం రఘునాథ్ రెడ్డి, ఏపీఓ సుధాకర్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఉత్తమ గ్రామ పంచాయతీగా గొట్లూరు

స్వచ్ఛభారత్ పథకం కింద మండలంలోని గొట్లూరు జాతీయస్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికైనట్లు ఎంపీడీఓ సాయిమనోహర్ సమావేశంలో వెల్లడించారు. గ్రామంలో సంపద తయారీ కేంద్రం నిర్వహణ మెరుగ్గా ఉండడంతో అవార్డుకు ఎంపిక చేశారన్నారు. దీంతో ఆ గ్రామ సర్పంచ్ పిట్టా నరసమ్మ, పంచాయతీ కార్యదర్శి గణేష్‌ను అభినందించారు. వారికి సమావేశానికి వచ్చిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు అభినందనలు తెలిపారు.

రేపు 'పురం'లో వసుంధరాదేవి పర్యటన

హిందూపురం, జూలై 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ భార్య వసుంధరాదేవి శుక్రవారం హిందూపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 11గంటలకు గోళ్లాపురంవద్ద నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తారు. 12 గంటలకు వీవర్స్ కాలనీలో జరిగే సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1గంటకు లేపాక్షి నవోదయ పాఠశాలలో హెరిటేజ్ సంస్థ సీఎస్ఆర్ నిధుల కింద ఏర్పాటు చేసిన సోలార్ వాటర్ గీజర్స్‌ను ప్రారంభిస్తారు. 2గంటలకు చిలమత్తూరు మండలం తమ్మినాయనపల్లిలో రూ.కోటితో నిర్మించిన సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తారు. సాయంత్రం 3గంటలకు లేపాక్షి మండలం ఓబుళాపురానికి రూ.3కోట్లతో నిర్మించిన తారు రోడ్డును ప్రారంభిస్తారు. 4గంటలకు పట్టణంలోని 8,9వార్డుల్లో జరిగే తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొనున్నట్లు నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నేటిలోగా అఫిడవిట్ దాఖలు చేయాలి

7

వ్యవసాయ శాఖకు హైకోర్టు ఆదేశం

వ్యవసాయ సహాయకుల పిటిషన్‌పై విచారణ రేపటికి వాయిదా

మాదకద్రవ్యాల రవాణా అరికట్టాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

పుట్టపర్తి టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, రవాణాను అరికట్టడానికి పటిష్ఠ చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మాదకద్రవ్యాల నివారణ, అక్రమ రవాణా నిరోధంపై ఎస్పీ రత్న, జేసీ అభిషేక్‌కుమార్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలను అరికట్టడానికి పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. విద్యార్థులు, ఆటో డ్రైవర్లు, కార్మికులను లక్ష్యంగా చేసుకుని మాదక ద్రవ్యాల రవాణా జరిగే అవకాశం ఉందన్నారు. ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈగల్ టీమ్ ద్వారా పలు ప్రాంతాల్లో నిఘా ఏర్పాటుచేశామని అన్నారు. పాఠశాలలు, కాలేజీలు, హాస్టళ్లు, డాబాలు, తదితర ప్రాంతాల్లో మత్తు పదార్థాల వినియోగం వల్ల జరిగే నష్టాలపై పోస్టర్లు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఆర్డీవో మహేష్, డీపీఓ సమత, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉచిత ఇసుక సరఫరా

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో పారదర్శకంగా ఉచిత ఇసుక సరఫరాను అమలు చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఇసుక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇసుక రీచ్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని అన్నారు. అంతర్‌రాష్ట్ర ఇసుక రవాణాను నిరోధించేందుకు పోలీసులు కృషిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్పీ రత్న, డీఎస్పీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జైలులోనే మార్పు రావాలి

ఖైదీలకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సూచన



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజశేఖర్

కదిరిలీగల్, జూలై23(ఆంధ్రజ్యోతి): సబ్ జైలులో విరామ సమయాన్ని సద్వినియోగం చేసుకుని, మార్పు కోసం ప్రయత్నించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి రాజశేఖర్.. ఖైదీలకు సూచించారు. కదిరి సబ్ జైలును బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట న్యాయవాదులు లోకేశ్వర్ రెడ్డి, సిరాజుద్దీన్, సబ్‌జైలు అధికారి ఉమామహేశ్వర నాయుడు ఉన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడారు. చేసిన నేరానికి పశ్చాత్తాప పడి ఆత్మ పరిశీలన చేసుకుని, మారాలని చెప్పారు. నాటుసారాతో అనర్థాలు వివరించగా.. ఆస్పత్రిలో ఉన్నా ఎక్సైజ్ పోలీసులు అక్రమ కేసులు బనాయించారని గిరిజన నిందితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. న్యాయవాది ద్వారా కోర్టులో న్యాయం పొందవచ్చని డీఎల్ఎస్ఏ హితువు పలికారు. లోక్ అదాలత్ ప్రయోజనాలను వివరించి, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సబ్ జైలులో అందుతున్న ఆహారం, వైద్యం, ఆరోగ్యం సౌకర్యాలను పరిశీలించారు.

జీడిపల్లి వైపు కృష్ణమ్మ పరుగులు

6

వేధింపులను క్షణం కూడా భరించొద్దు

మహిళలు, బాలికలు ధైర్యంగా బయటకు చెప్పాలి

- ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ
- 'మహిళల రక్షణ, భద్రత-సాధికారత'పై అవగాహన



సదస్సులో ప్రసంగిస్తున్న ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ

అనంతపురం క్రైం, జూలై 23(ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులను క్షణం కూడా భరించవద్దని మహిళలు, బాలికలకు ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ సూచించారు. వాటి గురించి ధైర్యంగా బయటకు వచ్చి చెప్పాలని అన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆమె, నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన 'మహిళల రక్షణ, భద్రత-సాధికారత'పై జిల్లాస్థాయి అవగాహన సదస్సులో ప్రసంగించారు. అంతకు మునుపు ఐసీడీఎస్ స్టాల్‌ను పరిశీలించారు. ఆ శాఖ ఆధ్వర్యంలో చేసిన కార్యక్రమాల వివరాలను తెలుసుకున్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. పనిచేసే చోట, కళాశాలలు, ఇతర ప్రాంతాల్లో మహిళలు, బాలికలకు వేధింపులు ఎదురవుతూ ఉంటాయని ఆమె అన్నారు. గృహహింస, బాల్య వివాహాలు, టీనేజ్ ప్రెగ్నెన్సీ వంటి అనేక సమస్యలను వారు ఎదుర్కొంటున్నారని అన్నారు. వారి హక్కుల రక్షణ కోసం మహిళా కమిషన్, ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తున్నాయని అన్నారు. కొందరు అమ్మాయిలు పెళ్లి అయినవారి ట్రాప్‌లో కూడా పడి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని అన్నారు. లవ్ ట్రాప్‌లో అస్సలు పడవద్దని, తల్లిదండ్రులు చెప్పే మంచి విషయాలను వినాలని సూచించారు. చదువుపై దృష్టి పెట్టాలని, బాగా చదువుకుంటే నే భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఎదుర్కొనే ధైర్యం (మిగతా 6లో)

పారదర్శకంగా విధులు నిర్వర్తించాలి

ప్రొబేషనరీ ఎస్ఐలకు ఎస్పీ దిశానిర్దేశం



ప్రొబేషనరీ ఎస్ఐలతో ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): పక్షపాతం లేకుండా పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ రత్న.. ప్రొబేషనరీ ఎస్ఐలకు దిశానిర్దేశం చేశారు. జిల్లాకు కేటాయించిన 15 మంది నూతన ఎస్ఐలకు.. విధులపై ఎస్పీ పలు సూచనలు చేశారు. పుట్టపర్తిలోని డీపీఓలో ఎస్పీ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణలో సమాచార సేకరణ, అనుమానితులపై నిఘా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట కీలకమన్నారు. జిల్లాలో పోలీసుశాఖ ప్రతిష్ఠ పెరిగేలా సేవలందించాలని ఎస్పీ సూచించారు.

రాష్ట్రస్థాయిలో అగ్రస్థానంలో నిలపాలి

విద్యాసంస్థల్లో శక్తి టీంలు విస్తృతంగా అవగాహన కల్పించి జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలని ఎస్పీ సూచించారు. డీపీఓలో బుధవారం జిల్లాలోని శక్తి టీం పనితీరుపై సమీక్షించారు. మహిళలు, చిన్నారుల భద్రత, గుడ్, బ్యాడ్ టచ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ర్యాగింగ్, గంజాయిని నివారించాలని అన్నారు. సమావేశంలో మహిళా పీఎస్ డీఎస్పీ ఆదినారాయణ పాల్గొన్నారు.

రైళ్లలో చోరీలపై నిఘా పెంచాలి

సౌత్ సెంట్రల్ రైల్వే డీఐజీ ఎండీఎస్‌జెడ్ ఖాన్ (వివరాలు 7వ పేజీలో...)

కల్యాణ శ్రావణం

(5వ పేజీ తరువాయి)

బంగారం, దుస్తుల కొనుగోలుకు పెద్దఎత్తున ఖర్చు పెడుతున్నారు. కొన్ని వివాహాలకు కోట్లలో వెచ్చిస్తున్నారు. భోజనాల్లో 20 నుంచి 30 రకాల వంటకాలు చేయించడానికి కూడా రాజీపడటం లేదు.

ఇప్పటికే వాహనాలన్నీ బుకింగ్

శ్రావణ మాసం నేపథ్యంలో ప్రైవేటు వాహనాలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు ముందస్తుగా బుకింగ్ అయిపోయాయి. కొంతమంది అడ్వాన్స్‌లు కూడా ఇచ్చేసుకున్నారు. శ్రావణంలో వాహనాలు దొరకాలన్నా కష్టమే. పెళ్లిళ్లు ఇతర శుభకార్యాలు చేయించే పురోహితులు బిజీ కానున్నారు. క్యాటరింగ్, డెకరేషన్‌కు కూడా బుకింగ్ చేసుకున్నారు.

ఊపందుకోనున్న వ్యాపారాలు

రెండు నెలలుగా శుభ ముహూర్తాల్లేక వ్యాపారాలు మందగించాయి. శ్రావణ మాసం రాకతో ఊపందుకోనున్నాయి. ఇప్పటికే పెళ్లిల్లు ఇతర శుభకార్యాల కోసం దుస్తులు, బంగారం కొని పెట్టుకుంటున్నారు.

శ్రావణ మాసంలో ఇతర పండుగలు కూడా ఉండడంతో అన్నిరకాల వ్యాపారాలు జోరందుకోనున్నాయి. వ్యాపారులు సైతం శ్రావణ మార్కెట్‌పై ఆశలు పెట్టుకున్నారు.

ముందుగానే బుకింగ్..



శ్రావణ మాసం ప్రారంభమవుతుండడంతో వివాహాలు, వివిధ శుభ కార్యాలయాలకు ముందుగానే కల్యాణ మండపం రిజర్వ్ చేసుకుంటున్నారు. ఏయే రోజుల్లో ఖాళీగా ఉన్నాయని కొందరు అడిగి వెళ్తున్నారు. ముహూర్తాలన్నీ ఏకబిగిన రావడంతో మండపాల కొరత రావచ్చు.

-చెన్నంశెట్టి జగదీశ్, సీబీఎన్ కల్యాణమండపం నిర్వాహకుడు, ధర్మవరం

తీరిక ఉండదు



శ్రావణ మాసం అంటేనే శుభకార్యాలయాలకు ప్రతీతి. ఈ నెలలో పెళ్లిళ్లు ఇతర శుభకార్యాలు ఎక్కువగా ఉంటాయి. వరలక్ష్మీ వ్రతానికి అత్యంత ప్రాచుర్యం ఉంటుంది. నెలంతా పురోహితులకు క్షణం తీరిక ఉండదు.

-రాజేశ్, పురోహితుడు

పండుగలే పండుగలు

పున్నమి చంద్రుడు శ్రవణా నక్షత్రంలో సంచరించడం వల్ల ఈ మాసంలో ఒక్కో రోజుకు ఒక్కో విశిష్టత ఉందని పండితులు పేర్కొన్నారు. ఈ మాసంలో వచ్చే అన్ని శుక్రవారాల్లోనూ శ్రావణ లక్ష్మి పూజలు చేస్తారు. నాలుగు మంగళవారాల్లో మంగళగౌరిని పూజిస్తారు. మరిన్ని పర్వదినాలు ఆచరించనున్నారు.



- జూలై 29న నాగుల పంచమి
- ఆగస్టు 8న వరలక్ష్మీవ్రతం
- 9న రాఖీపౌర్ణమి
- 12న సంకష్ట హరచతుర్థి
- 16న శ్రీకృష్ణాష్టమి
- 19న అజ ఏకాదశి
- 23న పోలాల అమావాస్య

చెట్టు దిగి.. కొండెక్కిన టెంకాయ..!



సూపర్‌మార్కెట్‌లో చిన్నపాటి కొబ్బరికాయ రూ.45 రాసిన దృశ్యం

హిందూపురం, జూలై 23(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసంలో పూజలు నిర్వహించే భక్తులను టెంకాయ ధరలు భయపెడుతున్నాయి. సాధారణ రోజుల్లో ఒక్కో టెంకాయ గరిష్ఠ ధర రూ.35 వరకూ ఉంటుంది. ప్రస్తుతం కొరత కారణంగా రూ.60కి చేరింది. కర్ణాటక, తమిళనాడులో పంట తగ్గిపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి జిల్లా వ్యాపారులు సుదూర ప్రాంతాల నుంచి టెంకాయలను కొనుగోలు చేసి తెచ్చుకుంటారు. దీంతో రవాణా ఖర్చులు పెరిగిపోయాయి. దీంతో కాయ సైజును బట్టి కనీసం రూ.35 ఆపై రూ.60 వసూలు చేస్తున్నారు. నెల వ్యవధిలో ఒక టెంకాయపై రూ.20 ధర పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. ధరలు పెరగడంతో తక్కువగా తెచ్చుకుంటున్నామని, లాభాలు తగ్గాయని వాపోతున్నారు. ధర భారీగా పెరగడంతో సామాన్యులు కొనడం లేదని, ఆలయాల్లో టెంకాలను కొట్టడం తగ్గించేశారని అంటున్నారు.

పంట లేకపోవడమే..

ఉమ్మడి జిల్లాలో కొబ్బరి చెట్లు చాలా తక్కువ. దీంతో కర్ణాటకలోని తుమకూరు, టిప్టూరు, శివమొగ్గ, తమిళనాడు, కొయంబత్తూరు, పొలచి నుంచి కొనుగోలు చేసి తెచ్చుకుంటారు. అక్కడ కూడా చెట్లకు చెదలు, పురుగులు పట్టడంతో ఈసారి పంట దిగుబడి 50 శాతానికి పైగా తగ్గింది. దీనికితోడు రాష్ట్రంలో కూడా కొబ్బరికాయల పంట పూర్తిగా రాలేదు. ఈ కారణాలతో ధరలు ఒక్కసారిగా భారీగా పెరిగాయి.

ఇప్పుడే ఇలా అయితే..

ఇప్పుడు పెరిగిన ధరలు ఆషాఢ మాసంలో అమలులో ఉన్నవి. ఇళ్లలో మినహా ఆలయాల్లో పెద్దగా పూజలు ఉండవు. ఆ మేరకు టెంకాల వినియోగం కూడా తక్కువగానే ఉంది. నిత్యం శుభకార్యాలు జరిగే శ్రావణ మాసం శుక్రవారం నుంచి మొదలౌతుంది. అప్పుడు పరిస్థితి ఎలా ఉంటుందోనని భక్తులు, వ్యాపారులు భయపడే పరిస్థితి ఏర్పడింది. సాధారణ పూజలకు ఒకటి రెండు టెంకాయలు సరిపడతాయి. కానీ శుభకార్యాల కోసం వందల్లో కొనాల్సి ఉంటుంది. దీంతో ఖర్చు తడిసి మోపడవుతుంది. వరలక్ష్మీవ్రతం, నాగులచవితి, వినాయకచవితి వంటి పండుగలు వరుసపెట్టి వస్తాయి. పెళ్లి, పేరంటం, గృహ ప్రవేశాలు వంటివి భారీగా జరుగుతాయి. డిమాండ్ పెరిగితే టెంకాయల ధరలు మరింత పెరుగుతాయని సామాన్యులు ఆందోళన చెందుతున్నారు.

ఎల్లీరు కూడా కారణం

కర్ణాటక, తమిళనాడు నుంచి వచ్చే టెంకాయలతో పాటు ఎల్లీరు (కొబ్బరి బోండాం) నీటికి ఎక్కువ గిరాకీ ఉంటుంది. అనారోగ్యం బారినపడితే ప్రతిరోజూ ఎల్లీరు నీరు తీసుకుంటారు. ప్రస్తుతం కొబ్బరికాయకంటే ఎల్లీరు ధర ఎక్కువగా ఉంటోంది. మంచి లాభాలు వస్తాయని ఎల్లీరు కాయలు అమ్మడానికే రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతారు. పైగా మూడు నెలలకే చెట్టు నుంచి పంటను తీసుకోవచ్చు. అదే టెంకాయ అయితే నాలుగు నుంచి ఐదునెలలపాటు చెట్టుపైనే కాయను ఉంచాల్సి వస్తుంది.



విక్రయించడానికి సిద్ధంగా ఉంచిన కొబ్బరికాయలు

ఒకప్పుడు లోడు తీసుకునేవాళ్లం..

గతంలో ఆషాఢ మాసంలోనే లోడు కొబ్బరికాయలు (సుమారు 15 వేలు) దిగుమతి చేసుకునేవాళ్లం. కానీ ఇప్పుడు ధరలు పెరగడంతో ప్రస్తుతం వెయ్యి లేదా రెండు వేల కాయలు మాత్రమే తీసుకుంటున్నాం. వ్యాపారాలు కూడా బాగా తగ్గాయి.

-నాగరాజు, కొబ్బరికాయల వ్యాపారి

ఎప్పుడూ ఈ ధర చూడలేదు..

నేను 20 ఏళ్లగా కొబ్బరికాయల వ్యాపారం చేస్తున్నాను. గతంలో ఎప్పుడూ ఇలా ఉన్నట్టుండి కొబ్బరి కాయల ధరలు పెరగడం చూడలేదు. ఇందుకు మన రాష్ట్రంతో పాటు కర్ణాటక, తమిళనాడులో పంట రాకపోవడమే కారణం.

-బాషా, కొబ్బరికాయల వ్యాపారి, హిందూపురం

పావగడలో ఉత్సవ శోభ

26 నుంచి శ్రావణమాస వేడుకలు



సిద్ధమైన సువర్ణ శనీశ్వరుడు

పావగడ, జూలై 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రసిద్ధి చెందిన శనీశ్వరుడి ఆలయం శ్రావణ మాస ఉత్సవాలకు ముస్తాబైంది. ఈనెల 25నుంచి జరిగే శ్రావణమాస ఉత్సవాలకు బంగారు కవచాలతో స్వామి అలంకృతమయ్యారు. ఉత్సవాల్లో జేష్టాదేవి సమేతంగా స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. ఈనెల 25నుంచి వచ్చేనెల 23వ తేదీ వరకు ఐదు శ్రావణ శనివారాల్లో ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. అందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

శనివారాల్లో..

జూలై 26న మొదటి శ్రావణ శనివారం సందర్భంగా ఉదయం నాలుగు గంటలకు స్వామివారికి తొలిపూజ చేస్తారు. పంచామృతాభిషేకాలు, నవగ్రహ పూజ నిర్వహిస్తారు. అదేరోజు రాత్రి7.30కి స్వామివారికి విశేష పూజలు చేయనున్నట్లు ప్రధాన అర్చకులు కృష్ణస్వామి, మనోహర్, సంజయ్ తెలిపారు. ఆగస్టు 2, 8, 16, 23 తేదీల్లో జేష్టాదేవి సమేతంగా వెండి పల్లకిలో స్వామివారు ఊరేగనున్నారు.

సకల దోషాలు తొలగుతాయని..

శ్రావణమాసం ఉత్సవాల సందర్భంగా శనేశ్వరున్ని దర్శించుకుంటే సకల శనిదోషాలు తొలగుతాయని భక్తుల అపార నమ్మకం. స్వామివారికి ఎంతో ఇష్టమైన నల్లగుడ్డ, నల్లనువ్వులు, నువ్వుల నూనె, అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణ చేసి, అందులోకి వేస్తే సకల పాపాలు తొలగిపోతాయని వారి విశ్వాసం. ఈ ఉత్సవాలకు ఉమ్మడి అనంత జిల్లాతోపాటు తమిళనాడు, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు.

హనుమాన్ దర్శన్ ప్రత్యేకం

బస్సు సర్వీసులు నడపనున్న ఆర్టీసీ

అనంతపురం టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసంలోని మంగళ, శనివారాల్లో ఒకే రోజున మూడు ఆంజనేయస్వామి దేవాలయాలను దర్శించుకోవడం అనంతపురం జిల్లాలో ఆనవాయితీగా వస్తోంది. ఇందుకోసం ఏటా ఆర్టీసీ శ్రావణమాసంలో ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతోంది. ఈ ఏడాది కూడా నడపనున్నట్లు అనంతపురం డీఎం నాగభూపాల్ వెల్లడించారు.

ఈనెల 26, 29, ఆగస్టు 2, 5, 9, 12, 16, 19 తేదీల్లో కసాపురం, మురడి, నేమకల్లు ఆంజనేయస్వామి దేవాలయాలను దర్శించుకునే భక్తులకోసం బస్సు సర్వీసులను నడపుతున్నట్లు పేర్కొన్నారు. మూడు ఆంజనేయస్వామి దేవాలయాలను ఒకేరోజున దర్శించుకునే వెసులుబాటు కల్పించారు. ముందస్తు రిజర్వేషన్ అవకాశం కూడా కల్పించినట్లు తెలిపారు.

పుణ్యఫలాలను ప్రసాదించే మాసం



శ్రావణం అత్యధికంగా పుణ్యఫలాలను ప్రసాదించే మాసం. ముత్తైదువులు ఈ మాసంలో అమ్మవారికి ముఖ్యంగా శ్రీచక్ర కుంకుమార్చన చేసుకోవడం వల్ల శుభఫలితాలను పొందుతారు.

- నరసింహశాస్త్రి, కాశీవిశ్వేశ్వర కోదండ దేవాలయం, అనంతపురం

విద్యాశాఖలో కలకలం

బోగస్ మెడికల్ సర్టిఫికెట్లపై ఫిర్యాదులు

12 మంది టీచర్లపై గుట్టుగా విచారణ

అనంతపురం విద్య, జూలై 23(ఆంధ్రజ్యోతి): బోగస్ మెడికల్ సర్టిఫికెట్లపై విచారణ విద్యాశాఖలో కలకలం రేపుతోంది. బదిలీల్లో అనుకూల స్థానాలు పొందేందుకు పలువురు టీచర్లు లేనిరోగాలను ఉన్నట్లు బోగస్ మెడికల్ సర్టిఫికెట్లు పెట్టారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అధికారిక లెక్కల మేరకు అన్ని కేడర్లలో కలిపి మే, జూన్ నెలల్లో చేపట్టిన బదిలీల్లో 422 మంది టీచర్లు వివిధ రకాల మెడికల్ సర్టిఫికెట్లతో ప్రిఫరెన్షియల్ కింద దరఖాస్తు చేసుకున్నారు. బదిలీలు పూర్తయి, వారికి కేటాయించిన స్థానాల్లో టీచర్లు చేరిపోయారు కూడా. ఇపుడు ఆ బోగస్ మెడికల్ సర్టిఫికెట్లపై విద్యాశాఖ గుట్టుగా విచారణ మొదలు పెట్టింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 12 మందిటీచర్లపై రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. వారి మెడికల్ సర్టిఫికెట్లను పక్కాగా పరిశీలించి, వాస్తవ నివేదికలు పంపాలని కమిషనరేట్ నుంచి జిల్లా విద్యాశాఖకు ఆదేశాలు వచ్చాయి. ఆ మేరకు జిల్లా అధికారులు ఆ 12 మంది టీచర్ల మెడికల్ సర్టిఫికెట్లపై విచారణ సాగిస్తున్నారు. డిప్యూటీ డీఈఓలు మెడికల్ సర్టిఫికెట్లను తెప్పించుకుని, పరిశీలిస్తున్నారు. దీంతో టీచర్లలో టెన్షన్ మొదలైంది. పెద్దఎత్తున టీచర్లు బోగస్ మెడికల్ సర్టిఫికెట్లు పెడితే.. 12 మంది పైనే విచారణ చేయడం ఏంటని ఉపాధ్యాయ వర్గాలు మండిపడుతున్నాయి. ఏదిఏమైనా మెడికల్ సర్టిఫికెట్ల పరిశీలన జాబితాలో ఉన్న టీచర్లలో ఆందోళన నెలకొంది.

విచారణ చేస్తున్నాం: డీఈఓ

బదిలీల్లో ప్రిఫరెన్షియల్ కింద లబ్ధిపొందిన టీచర్ల మెడికల్ సర్టిఫికెట్లపై ఫిర్యాదులు వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో 12మంది టీచర్ల సర్టిఫికెట్లపై విచారణ చేసి, నివేదిక ఇవ్వాలని రాష్ట్ర శాఖ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఆ మేరకు ఆజాబితాలో ఉన్న టీచర్ల మెడికల్ సర్టిఫికెట్లను పునఃపరిశీలిస్తున్నాం. ఈ బాధ్యతలను ఆయా డిప్యూటీ డీఈఓలకు అప్పగించాం. విచారణ చేస్తున్నారు.

చినుకు పడితే... కునుకు కరువు..!

వరద వస్తే మునుగుతున్న కాలనీలు

15 ఏళ్ల క్రితం తెగిన ఆత్మకూరు చెరువు

వృథాగా పోతున్న చెరువునీరు

మరమ్మతులు పట్టని అధికారులు, పాలకులు



ఆత్మకూరు, జూలై23(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం వచ్చిందంటే మండల కేంద్రంలోని పలు కాలనీల ప్రజలు ముంపు భయంతో వణికిపోతుంటారు. భారీ వర్షం కురిసినపుడల్లా కాలనీలు మునకే. ఏటా పలుమార్లు ఇదే దుస్థితి ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలోనే ఉన్న చెరువు తెగిపోయి 15 ఏళ్లయింది. దీంతో భారీ వర్షం కురిసినపుడల్లా కాలనీల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై పెద్దఎత్తున వరద ప్రవాహంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. వర్షపు నీరు చెరువులో నిల్వ ఉండకుండా వచ్చినది వచ్చినట్లుగా వెళ్లిపోతుండడంతో భూగర్భ జలమట్టాలు తగ్గిపోతున్నాయనీ, వ్యవసాయ బోర్లు ఎండిపోతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా చెరువుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. చెరువు తెగిపోయి, వరదంతా కిందనే ఉన్న చెక్ డ్యాంలోకి చేరుతోంది. ఆ నీరు కాలనీలను ముంచెత్తుతుండడంతో దానినీ తెగ్గొట్టారు. గత టీడీపీ హయాంలో చెరువు మరమ్మతులకు చర్యలు చేపట్టగా.. అప్పట్లో వైసీపీ నాయకులు అడ్డుపడినట్లు తెలుస్తోంది. తమ పార్టీ అధికారంలోకి రాగానే చెరువు మరమ్మతులు చేస్తామని ప్రగల్భాలు పలికినట్లు సమాచారం. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పాలించినా.. చెరువు మరమ్మతుల ఊసే ఎత్తలేదని మండల కేంద్రం వాసులు మండిపడుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో మరమ్మతులకు అడుగులు పడుతున్నాయని రాజకీయ వర్గాల ద్వారా తెలుస్తోంది.



గతేడాది పాత ఎస్సీ కాలనీలో నిలిచిన వర్షపునీరు

అనుమతులు లభించినా..

వర్షం వచ్చినపుడల్లా వరద నీటితో స్థానిక సర్దార్ వలి దర్గా దగ్గర తీవ్ర అసౌకర్యంగా ఉంటోంది. సమీప ఇళ్లను నీరు ముంచెత్తుతోంది. పాత ఎస్సీ కాలనీలోకి పెద్దఎత్తున నీరు చేరుతోంది. ప్రవాహం తగ్గేవరకు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడుతోంది. వర్షపునీరు గతంలో అధికంగా రావడంతో సమీపాన 5 లక్షలతో నిర్మించిన చెక్ డ్యాంను అధికారులు ఎక్స్‌కవేటర్‌తో తెగ్గొట్టేశారు. ఇంత వరకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టలేదు. వర్షాకాలం వస్తే.. చెరువు సమీపాన నివాసముండేవారు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిందే. ఏళ్లగా చెరువు మరమ్మతులు చేయాలని వినతి పత్రాలు అందజేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుసార్లు మరమ్మతులు చేయాలని ప్రతిపాదనలు పంపి, అనుమతులు లభించినా పనులు ముందుకు సాగలేదు. దీంతో ప్రతిసారీ నిధులు వెనక్కి పోతున్నాయి. గ్రామానికి ఉన్న ఏకైక చెరువులో కూడా నీరు నిల్వ లేకపోవడంతో చుట్టుపక్కల భూగర్భ జలాలు పడిపోతున్నాయి. చివరికి చేతిపంపుల్లో నీరు రాక నిరుపయోగంగా మారాయి.

బిక్కుబిక్కుమంటూ గడపాల్సిందే..



వర్షాకాలం వస్తే రాత్రి వేళల్లో నిద్ర ఉండదు. ఇంటిల్లిపాదీ బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తుంది. మాగోడు పట్టించుకునేవారు లేరు. భారీ వర్షం వస్తే పెద్దఎత్తున వరద నీరు కాలనీని ముంచెత్తుతుంది. నెలరోజులైనా ఇంటి ముందు నీరు తగ్గదు. కాలనీలోకి వర్షపునీరు రాకుండా చర్యలు చేపట్టాలి. - సంధ్య, ఎస్సీ కాలనీ, ఆత్మకూరు

పట్టా భూములతోనే చిక్కులు

చెరువు మరమ్మతులు చేస్తే నీరు నిల్వ ఉంటుంది. ముంపు ప్రాంతం పట్టా భూములు కావడంతో మరమ్మతులు చేయడానికి ఆటంకాలు ఎదురవుతున్నాయి. టీడీపీ హయాంలో భూములకు పరిహారం ఇచ్చి, స్వాధీనం చేసుకునేలా సంబంధిత రైతులతో అధికారులు చర్చలు జరిపారు. రైతులు ముందుకు రాకపోవడంతో చెరువు మరమ్మతులు నిలిచిపోయాయి. ఆ తరువాత వైసీపీ పాలనలో పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు. రోడ్డుపై వర్షపునీటితో కష్టాలు పడ్డారు. ప్రస్తుతం వర్షాలు ప్రారంభమవడంతో స్థానికుల్లో భయం మొదలైంది. చెరువు మరమ్మతులు మాత్రం రైతులతో మాట్లాడి సానుకూలంగా సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కోతకు గురైన భూములు

వర్షపునీరు తెగిపోయిన చెరువు నుంచి అధికంగా రావడంతో చెరువు ప్రాంతంతో పాటు కింద ప్రాంతంలో భూమి కోతకు గురవుతోంది. మనిషిలోతు గోతి ఏర్పడి, ప్రమాదకరంగా మారింది. చెరువు కింద కాలువ భద్రత లేక అటు, ఇటు నర్సరీల్లోకి నీరు చేరుతోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చెరువు మరమ్మతులు చేపట్టి వర్షపునీటిని అదుపుచేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



వర్షపునీటిలో నడవాల్సిందే: శివారెడ్డి, ఆత్మకూరు



వర్షం వచ్చిందంటే ఇంటి చుట్టూ నీరు చేరుతోంది. బయటకు వెళ్లే అవకాశం కూడా ఉండదు. చెరువు నుంచి ఉధృతంగా వచ్చేనీరు మరింత ఇబ్బంది పెడుతుంది. పలుమార్లు అధికారులకు చెప్పినా ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలి.

చెరువు మరమ్మతులకు చాలాసార్లు ప్రయత్నించాం

తెగిపోయిన చెరువు మరమ్మతులు చేయాలని గతంలో చాలాసార్లు ప్రయత్నాలు చేసినా ఫలితం లేదు. చెరువు ముంపు ప్రాంతం పట్టా భూమి. సంబంధిత రైతులతో చర్చలు జరిపినా కొలిక్కి రాలేదు. వరద ముంపు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

-కృష్ణకుమార్, ఇరిగేషన్ ఇంజనీర్

జీడిపల్లి వైపు కృష్ణమ్మ పరుగులు



చిన్నముష్టూరు వద్ద పూజలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

ఉరవకొండ, జూలై 23(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని రాగులపాడు హంద్రీనీవా కాలువ వద్ద ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం నుంచి జీడిపల్లి రిజర్వాయర్‌కు బుధవారం అధికారులు నీటిని విడుదల చేశారు. ఈ నెల17న కర్నూలు జిల్లా మల్యాల వద్ద హంద్రీనీవాకు నీటిని వదలగా.. మంగళవారం అర్ధరాత్రి పంప్ హౌస్ వద్దకు చేరుకున్నాయి. మూడు మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోసి కాలువకు వదిలారు. 850 క్యూసెక్కుల దాకా నీటిని వదిలినట్లు అధికారులు తెలిపారు. కాలువకు నీరు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకు చేరుకున్న కృష్ణాజలాలకు హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు, టీడీపీ నాయకులు జల హారతి ఇచ్చారు. రాగులపాడు లిఫ్ట్ వద్ద అధికారులు పూజలు నిర్వహించి మోటార్లను ఆన్‌చేశారు. అనంతరం పంపుల వద్ద కృష్ణాజలాలకు అధికారులు, టీడీపీ నాయకులు పూజలు చేశారు. చిన్నముష్టూరు సమీపంలో కృష్ణాజలాల్లోకి పసుపు, కుంకుమ వదిలి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఈలు రమణ, నాగరాజు, ఏఈలు సురేష్, భాస్కర్, టీడీపీ నాయకులు దేవినేని పురుషోత్తం, విజయ్‌భాస్కర్, రామాంజనేయులు, తిమ్మప్ప, బీసీ మారెన్న, గోవిందు, గోనుగుంట్ల నాగేంద్ర, ఎర్రిస్వామి, మాజీ ఎంపీపీ సుంకరత్నమ్మ పాల్గొన్నారు.

ఫలించిన మంత్రి కృషి

హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు పూర్తి కావడంతో నీటి ప్రవాహ సామర్థ్యం పెరగనుంది. జిల్లాలో మొదటి ఫేజ్ ప్యాకేజీ-2 పనులు పూర్తయ్యాయి. ఇరిగేషన్, రెవెన్యూ, ఏపీఎస్ఈబీ, హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులను అప్రమత్తం చేస్తూ, సమీక్షలు నిర్వహిస్తూ, వంద రోజుల్లోనే పూర్తి చేస్తామని మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పిన మాట నిలబెట్టుకున్నారు. సీఎం ఆదేశాలకు అనుగుణంగా మంత్రి ప్రత్యేక దృష్టిసారించి హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వెడల్పు పనులపై నీరు వచ్చేలోపు పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లతో పనులు చేయించారు. దీంతో నీరు పారేందుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా పోయాయి. గతంలో హెచ్ఎన్ఎస్ఎస్ కాలువలో 1300 నుంచి 1400 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుండగా.. వెడల్పు పనులు పూర్తి కావడంతో 3,200 నుంచి 3,450 క్యూసెక్కుల వరకూ నీరు కాలువలో ప్రవహించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వీటితో పాటు తూముల ద్వారా చెరువులకు నీరు ఇవ్వడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

వేధింపులను క్షణం కూడా భరించొద్దు

(5వ పేజీ తరువాయి)

వస్తుందని అన్నారు. స్నేహం పేరుతో సామాజిక మాధ్యమాల్లో ఎవరికీ వ్యక్తిగత వివరాలు, ఫొటోల, వీడియోలు పంపవద్దని సూచించారు. ఇటీవలి కాలంలో బాగా చదువుకున్న డాక్టర్లు, ఇంజనీర్లు సైతం గృహహింస కేసులు పెట్టుకునే పరిస్థితి వచ్చిందని అన్నారు. పెళ్లికి ముందు కౌన్సెలింగ్‌పై కూడా ప్రత్యేక దృష్టి పెడతామని అన్నారు. ఆపద సమయాల్లో హెల్‌లైన్ నంబర్లు వాడాలని, శక్తి యాప్‌ను మహిళలు, విద్యార్థినులు తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ప్రతి మహిళ సురక్షితంగా, ధృడంగా ఉండాలని అన్నారు. అనంతరం ఐసీడీఎస్ శాఖకు సంబంధించిన పలు పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో మలోల, ఆర్డీఓ కేశవనాయుడు, ఐసీడీఎస్ పీడీ నాగమణి, డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, మాజీ మేయర్ స్వరూప, దిశ సీఐ వెంకటేశ్వర్లు, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజశ్విని, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర విచారణ జరపాలి: ఐద్వా

అనంతపురం టౌన్: ఉమ్మడి జిల్లాలో మహిళలు, బాలికల హత్యలు, వారిపై అత్యాచారాల గురించి సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి డిమాండ్ చేశారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజకు ఐద్వా ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. అనంతపురంలో ఇంటర్ విద్యార్థిని తన్మయి హత్య, శ్రీసత్యసాయి జిల్లాలో అత్తాకోడళ్లపై సామూహిక అత్యాచారం, రామగిరి మండలంలో 9వ తరగతి విద్యార్థినిపై 14 మంది అత్యాచారం తదితర ఘటనలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో బాలికలు, మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయని అన్నారు. మద్యం, గంజాయి, పోర్న్ వీడియోలు దీనికి కారణమని అన్నారు. అన్ని విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. ఈ కేసుల సత్వర విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాళ్లు చంద్రిక, శైలజ, గీత తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా నాయకురాలు సావిత్రి తదితరులు

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


పాళ్యం రామ్మూర్తి (ఫైల్)

చెన్నేకొత్తపల్లి, జూలై 23(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ రైతు తన వ్యవసాయ పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు... చెన్నేకొత్తపల్లి మండలంలోని నామాల గ్రామానికి చెందిన పాళ్యం రామ్మూర్తి(38) అనే రైతు తన సొంత వ్యవసాయ తోటలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రామ్మూర్తి మూడెకరాల సొంత పొలంతో పాటు తొమ్మిది ఎకరాలు కౌలుకు తీసుకుని పంటలు సాగుచేసుకుంటుండేవాడు. 12 బోర్లు వేసినా నీరు పడలేదు. దీనికి తోడు గత కొన్నేళ్ల నుంచి బెండ, గోరుచిక్కుడు, వేరుశనగ పంటలు సాగుచేస్తూ తీవ్రంగా నష్టపోయాడు. పంటల పెట్టుబడులకు, బోర్లు వేయడానికి తెచ్చిన అప్పులు రూ.14లక్షలకుపైగా అయ్యాయి. వాటికి వడ్డీ తీర్చేమార్గం లేకపోయింది. ఈ ఒత్తిడితో మంగళవారం రాత్రి తన సొంత వ్యవసాయ తోట వద్దకు వెళ్లాడు. అక్కడ తీవ్ర ఒత్తిడిలో ఉన్న రైతు అర్ధరాత్రి సమయంలో తాను తోటలో పురుగుల మందు తాగానని చిన్నాన్నకు ఫోన్‌ద్వారా తెలిపాడు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన పొలం వద్దకు చేరుకుని చికిత్స నిమిత్తం ధర్మవరం ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం, కర్నూలుకు తరలించారు. పరిస్థితి విషమించడంతో బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఆయనకు భార్య అంజలి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

తలుపులలో...


వెంకటరమణ (ఫైల్)

కదిరి, జూలై 23(ఆంధ్రజ్యోతి): తలుపుల మండల కేంద్రానికి చెందిన ఎస్. వెంకటరమణ (48) అనే వ్యక్తి అప్పులబాధతో బుధవారం ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానిక ఎస్ఐ నరసింహుడు తెలిపారు. ఎస్ఐ తెలిపిన మేరకు.. వెంకటరమణ బుధవారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో విషపు గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య రత్నమ్మ ఫిర్యాదు చేసింది. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మూడు సంవత్సరాల కిందట పెద్ద కుమారుడు యశ్వంత్‌కు రోడ్డు ప్రమాదం జరిగి తీవ్రంగా గాయపడ్డాడు. వైద్యం కోసం దాదాపు 15 తులాల బంగారును బ్యాంకులో తాకట్టు పెట్టారు. సంవత్సరం కిందట వెంకటరమణ తల్లి మరణించింది. తాకట్టులో ఉన్న బంగారు వేలం వేస్తామని నోటీసులు ఇచ్చారు. అప్పులు ఎక్కువ కావడంతో తీవ్ర మనస్థాపానికి గురై విషపు గుళికలు మింగినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రైలు కిందపడి యువకుడు...

తాడిపత్రి, జూలై23(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద గుర్తుతెలియని యువకుడు (30) బుధవారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వరప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మృతుడి వద్ద చెన్నై సెంట్రల్ నుంచి కడప జనరల్ టికెట్ ఉందని, మిగతా వివరాలు ఏమి లేవని అన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని తెలిపారు.

24 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 24 మండలాల్లో మంగళవారం వర్షం కురిసింది. అత్యధికంగా యల్లనూరులో 21.4 మి.మీ. వర్షపాతం నమోదయింది. గుంతకల్లులో 17.2 మి.మీ, వజ్రకరూరు 15.0, పామిడి 11.4, గుత్తి 11.2, విడపనకల్లు 8.2, పుట్లూరు 6.4, పెద్దవడుగూరు 6.2, అనంతపురం నగరం 5.2, డి.హీరేహాల్ 4.8, యాడికి, తాడిపత్రి 4.2, నార్పల 3.8, కూడేరు 3.2, కణేకల్లు, ఉరవకొండ, కణేకల్లు 3.0, ఆత్మకూరు 2.4, రాయదుర్గం, కళ్యాణదుర్గం, బొమ్మనహాల్ 2.0 మి.మీ వర్షపాతం నమోదయింది. మిగతా మండలాల్లో 2.0 మి.మీ లోపు వర్షం కురిసింది. బుధవారం అనంతపురం, కూడేరు, బొమ్మనహాల్, పుట్లూరు, యాడికి, గార్లదిన్నె, గుత్తి, పెద్దవడుగూరు తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

టమోటా కిలో రూ.34

అనంతపురం రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో బుధవారం కిలో టామోటా గరిష్ఠంగా రూ.34తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.20, సరాసరి ధర రూ.26తో విక్రయాలు జరిగాయన్నారు.

చీనీ టన్ను రూ.17 వేలు

అనంతపురం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా 17,100తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిం దు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 1095 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

వీరజవాన్ కుటుంబానికి సాయం



చెక్కును అందజేస్తున్న యోగా సిందూర్ బృందం

గోరంట్ల, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లితండాకు చెందిన వీరజవాన్ మురళీనాయక్ కుటుంబానికి యోగాసిందూర్ సంస్థ తరఫున రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు బుధవారం జవాన్ తల్లిదండ్రులు శ్రీరామునాయక్, జ్యోతిబాయిలకు చెక్కును ఇచ్చారు. యోగా సిందూర్ బృందం కల్లితండాకు వెళ్లి జవాన్ కుటుంబాన్ని కలిసింది. త్యాగానికి సమానమైన మాటలు లేవని, తమ సహాయం వారి కుటుంబానికి, దేశప్రజల తరఫున తెలియచేసే కృతజ్ఞత అన్నారు. కార్యక్రమంలో యోగా సింధూర్ వ్యవస్థాపకుడు డాక్టర్ యోగా నారాయణ, కమిటీ అధ్యక్షుడు శివదుర్గాప్రసాద్, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ శరత్‌కుమార్‌రెడ్డితో పాటు పవన్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, డాక్టర్ ధనుజయ్, రాధిక, దేవరాజుస్వామి, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, చలం, శంకర్, సాయినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటిలోగా అఫిడవిట్ దాఖలు చేయాలి

వ్యవసాయ శాఖకు హైకోర్టు ఆదేశం

వ్యవసాయ సహాయకుల పిటిషన్‌పై విచారణ రేపటికి వాయిదా



అనంతపురం అర్బన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సహాయకుల బదిలీలకు సంబంధించిన విచారణను హైకోర్టు ఈనెల 25వ తేదీకి వాయిదా వేసింది. శ్రీసత్యసాయి జిల్లాలోని 11 మంది, అనంతలో ఇద్దరు, కర్నూలులో 20 మంది, ప్రకాశం, చిత్తూరు జిల్లాకు చెందిన మరికొందరు వ్యవసాయ సహాయకులు తమకు బదిలీల్లో అన్యాయం జరిగిందని హైకోర్టును వేర్వేరుగా ఆశ్రయించారు. ఆయా జిల్లాల సిబ్బంది రిట్ పిటిషన్లపై హైకోర్టు వేర్వేరుగా స్టేటస్ కో ఆర్డర్లు జారీ చేసింది. ఆయా జిల్లాల సిబ్బందిది ఒకే సమస్య కావడంతో అందరి పిటిషన్లను కలిపి బుధవారం విచారణకు పిలిచింది. వ్యవసాయ శాఖ యంత్రాంగం కౌంటర్ (అఫిడవిట్) దాఖలు చేయలేదు. అఫిడవిట్‌ను గురువారం దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను శుక్రవారానికి హైకోర్టు న్యాయమూర్తి వాయిదా వేశారు.

కోర్టు ధిక్కారం తప్పదా..?

ఉమ్మడి అనంత జిల్లాకు సంబంధించి రైతు సేవాకేంద్రంలో పనిచేసే వ్యవసాయ సహాయకులకు గతనెల 28వతేదీ అనంత జేడీఏ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. తమకు మంచి ర్యాంకు ఉన్నా.. అడిగిన స్థానాలు కేటాయించకుండా అన్యాయం చేశారని బాధితులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన 11 మంది వ్యవసాయ సహాయకులు పలుమార్లు కలెక్టర్, జేడీఏలను కలిసి విన్నవించారు. ఈ నేపథ్యంలో ఈనెల 14వ తేదీన 11 మంది హైకోర్టులో రిట్ పిటీషన్ వేశారు. ప్రస్తుతం సిబ్బంది పనిచేస్తున్న స్థానాల్లోనే రెండు వారాలపాటు కొనసాగించాలంటూ ఈనెల 15న హైకోర్టు రిట్ పిటీషన్‌పై స్టేటస్‌కో ఆర్డర్ ఇచ్చింది. ఇదే క్రమంలో సంబంధిత న్యాయవాది తరఫున పిటిషన్ దాఖలు చేసిన సిబ్బంది ఈనెల 17వ తేదీన అనంత జేడీఏ కార్యాలయంలో కోర్టు ఆర్డర్‌ను అందజేసినట్లు సమాచారం. తమకు కోర్టు ద్వారా నేరుగా ఉత్తర్వులు రాలేదన్న కారణంతో సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోలేదని సమాచారం. హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిన రోజు నుంచి పిటిషన్ దాఖలు చేసిన సిబ్బంది స్థానాలు యథాతథంగా కొనసాగించేలా సంబంధిత ఎంపీడీఓలు, ఏడీఏలకు జేడీఏ కార్యాలయం నుంచి అధికారికంగా ఆర్డర్ పంపాల్సి ఉండగా... ఇప్పటిదాకా ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదని సమాచారం. ఈ నేపథ్యంలో కోర్టు ఉత్తర్వుల తర్వాత పటిషన్ దాఖలు చేసిన సిబ్బంది స్థానాల్లో కొత్త వారిని జాయిన్ చేసుకుని, పాత వారిని రిలీవ్ చేశారు. కర్నూలు జిల్లాలో పిటిషన్ దాఖలు చేసిన 20 మంది స్థానాలను యథాతథంగా కొనసాగించాలని ఆ జిల్లా జేడీఏ సంబంధిత ఎంపీడీఓలు, ఏడీఏలకు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పిటిషన్ దాఖలు చేసిన సిబ్బంది స్థానాలను మార్చలేదు. ఉమ్మడి అనంత జిల్లాలో అందుకు విరుద్ధంగా సంబంధిత అధికారులు వ్యవహరించడాన్ని బుధవారం హైకోర్టు జడ్జి దృష్టికి వ్యవసాయ సహాయకుల తరఫు న్యాయవాది తీసుకెళ్లినట్లు సమాచారం. శుక్రవారం విచారణలో ఈ విషయం నిరూపితమైతే కోర్టు ధిక్కారం కేసు నమోదు చేస్తామని జడ్జి స్పష్టం చేసినట్లు తెలిసింది. జిల్లా అధికారుల నిర్లక్ష్యం వారి మెడకు చుట్టుకునే అవకాశం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం కోర్టులో జరిగే పరిణామాలపై ఆ శాఖలో సర్వత్రా చర్చ సాగుతోంది.

ఆటోడ్రైవర్లకు సామాజిక బాధ్యత అవసరం

- ఎస్పీ రత్న


ఆటో డ్రైవర్ల వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్లు సామాజిక బాధ్యతతో మెలగాలని ఎస్పీ రత్న సూచించారు. పుట్టపర్తిలోని సాయిఆరామంలో బుధవారం ఆటోడ్రైవర్లకు భద్రత-బాధ్యత అనే అంశంపై అవగాహన సదస్సు, మెగా వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా ఎస్పీ మాట్లాడుతూ.. నిత్యం అన్నిప్రాంతాలకు వెళ్లే ఆటోడ్రైవర్ల దృష్టికి సమాజంలో జరిగే ఎన్నో ఘటనలు వస్తాయన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, వాటికి పాల్పడే వారి సమాచారాన్ని పోలీసులకు అందించడంలో ముందుండాలని ఎస్పీ సూచించారు. ఆటోడ్రైవర్లు.. ప్రయణికులను భద్రంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలకు వచ్చే ఇతర రాష్ట్రాలు, దేశాల భక్తులతో మర్యాదగా మెలగాలని సూచించారు. నేరస్తుల సమాచారం ఇస్తే.. ఆటోడ్రైవర్లకు ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఫైరోజ్‌బేగం, డీఎస్పీ విజయ్‌కుమార్, ఎంవీఐ వరప్రసాద్, పుట్టపర్తి, నల్లమాడ, కొత్తచెరువు, పుట్టపర్తి రూరల్ సీఐలు సునీత, నరేందర్‌రెడ్డి, మారుతీశంకర్, సురేష్‌కుమార్, ఎస్ఐలు, వందలమంది ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

రైళ్లలో చోరీలపై నిఘా పెంచాలి

● సౌత్‌సెంట్రల్ రైల్వే డీఐజీ ఎండీఎస్‌జెడ్ ఖాన్


మాట్లాడుతున్న సౌత్‌సెంట్రల్ డీఐజీ

అనంతపురం న్యూటౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో చోరీల నివారణకు మరింత నిఘా పెంచాల్సిన అవసరం ఎంతైన ఉందని సౌత్‌సెంట్రల్ రైల్వే డీఐజీ ఎండీఎస్ జెడ్ ఖాన్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన అనంతపురం ఆర్పీఎఫ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. అందులో భాగంగా పలు రికార్డులను పరిశీలించారు. పలు చోరీల కేసులో రికవరీ చేసిన సామగ్రికి సంబంధించిన రిజిష్టరు, వస్తువుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధానంగా విజిబుల్ పోలిసింగ్ ద్వారా చోరీలను అరికట్టడానికి అవకాశం ఉందన్నారు. అందుకు అనుగుణంగా తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. పెట్రోలింగ్‌లో ఉన్న సిబ్బంది ప్రయాణికులతో మమేకం కావడం ద్వారా చోరీలకు పాల్పడేవారికి భయం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ మధ్య కాలంలో రన్నింగ్‌లో ఉన్న రైళ్లపై రాళ్ల విసరడం, ప్రయాణికులను ఇబ్బంది పెట్టడం లాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని, వీటిపై మరింత నిఘా ఉంచాలని ఆదేశించారు. సమావేశంలో డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ ఆకాశ్ కుమార్ జెస్వాత్, సీఐ సుధాకర్‌రావు, ఎస్ఐ పవన్‌కుమార్‌రెడ్డి, ఏఎస్ఐలు మహమ్మద్ రఫీ, ప్రతాప్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గూగూడు కుళ్లాయిస్వామి హుండీ చోరీ

ఆ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు

సోషల్ మీడియాలో వైరల్


ట్రాక్టర్‌లో హుండీ

నార్పల, జూలై 23(ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన గూగూడు కుళ్లాయిస్వామికి భక్తులు సమర్పించిన కానుకలు వేసే హుండీ ఒకటి చోరీ జరిగినట్లు సీసీ కెమెరాలో రికార్డయింది. బ్రహ్మోత్సవాల్లో కుళ్లాయిస్వామి మకాన్‌లో ఉండే ఒక హుండీని దేవదాయ శాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి ట్రాక్టర్ తీసుకువచ్చి తీసుకెళ్లాడు. అది సీసీ కెమెరాలో రికార్డు అయింది. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. హుండీ మాయంపై దేవదాయ శాఖ అధికారి కీలక పాత్ర ఉందని సమాచారం. ఆ హుండీలో ఎన్ని లక్షల రూపాయల డబ్బు ఉందో అనేది గ్రామంలో చర్చనీయంశంగా మారింది. ఈ ఘటనపై దేవదాయ శాఖ అధికారి శోభ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హుండీ చోరీ జరగలేదని, అనసరమైన ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. సీసీ కెమెరా గురించి విలేకరులు అడిగిన ప్రశ్నకు ఈఓ తడబడుతూ సమాధానం దాటవేశారు.

అర్జున్ టెండూల్కర్ సెంచరీ


అర్జున్ టెండూల్కర్


దత్తారెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో అర్జున్ టెండూల్కర్ సెంచరీ సాధించాడు. విజయనగరంలో జరుగుతున్న ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సీనియర్ వన్డే రాష్ట్రస్థాయి ప్రాబబుల్స్ మ్యాచ్‌లో జిల్లాకు చెందిన అర్జున్ టెండూల్కర్ 90 బంతుల్లో 13 బౌండరీలు, 9 సిక్సర్లతో 115 పరుగులు చేశాడు. ఎంకే దత్తారెడ్డి 68 బంతుల్లో 10 బౌండరీలు, 3 సిక్సర్లతో 83 పరుగులు చేశాడు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా క్రీడాకారులను జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమ లింగారెడ్డి అభినందించారు.

పెనుకొండలో రేపు మెగా జాబ్‌మేళా

పెనుకొండ, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీకళాశాల ఆధ్వర్యంలో ఈనెల 25న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరిక్రిష్ణ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక పరిటాల డిగ్రీ కళాశాలలో ఉదయం 10గంటలకు నిర్వహించే జాబ్‌మేళాలో 12 బహుళ జాతి కంపెనీలు పాల్గొంటున్నాయని వివరించారు. అభ్యర్థులు పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, బీఫార్మసీ, ఎం.ఫార్మసీ, నర్సింగ్, డిగ్రీ, బీటెక్, పీజీ చదివి 18-35 సంవత్సరాల వయసు కలిగిన వారు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు 9966682246కు సంప్రదించాలన్నారు.

పంటల బీమా గడువు పొడిగింపు

ఈ నెల 31వరకూ అవకాశం

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ


ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఉమామహేశ్వరమ్మ

ఉరవకొండ, జూలై 23(ఆంధ్రజ్యోతి): పంటల బీమా గడువు ఈనెల 31వ తేదీ వరకూ పొడిగించారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు 64వేల హెక్టార్లలో పంటలు సాగు అయినట్లు పేర్కొన్నారు. వజ్రకరూరు మండలం పీసీ ప్యాపిలి గ్రామంలో మోడల్ పల్స్ విలేజ్ కింద రైతులకు కంది విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం ఉరవకొండలో ఏడీఏ కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ.. పీసీ ప్యాపిలి గ్రామాన్ని ఆదర్శ అపరాళ్ల గ్రామం కింద ఎంపిక చేశామని తెలిపారు. పీజీఆర్ 176 రకం కందిని ఉచితంగా పంపిణీ చేశామని అన్నారు. జిల్లాలో 3.20 లక్షల హెక్టార్లకు గాను 64వేల హెక్టార్లలో మాత్రమే వేరుశనగ, కంది, పత్తి, పంటలు సాగు అయ్యాయని వివరించారు. వర్షపాతం 40 శాతం తక్కువ నమోదయిందన్నారు. ఉరవకొండ మండలంలోని చిన్నముష్టూరు, పెద్దముష్టూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ క్రాప్ బుకింగ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మూలగారపల్లిలో ఎస్ఎంఈవో పథకం కింద విత్తనాలు తీసుకున్న పొలాల రైతులను సందర్శించారు. ఈ కార్యక్రమాల్లో ఏడీఏ సత్యనారాయణ, ఏవోలు రామకృష్ణ, మధుకర్, ఏఈవోలు భరత్, వెంకటనారాయణ పాల్గొన్నారు.

ప్రాణాలు తీసిన ప్రమాదాలు

ఇద్దరు విద్యార్థుల సహా నలుగురి మృతి

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు ప్రాంతాలలో జరిగిన రోడ్డు ప్రమాదాలలో బుధవారం నలుగురు మృతిచెందారు. వీరిలో ఇద్దరు విద్యార్థులు ఉన్నారు. వాహనాలు ఢీకొని ముగ్గురు, బైకు అదుపుతప్పి ఒకరు ప్రాణాలు కోల్పోయారు. దీంతో బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదం అలుముకుంది.


కన్నీరు మున్నీరవుతున్న అఖిల్ కుటుంబ సభ్యులు, ఇన్‌సెట్‌లో అఖిల్ (ఫైల్)

ఇసుక ట్రాక్టర్ ఢీకొని విద్యార్థి దుర్మరణం

పరిగి, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఊటకూరు గ్రామానికి చెందిన అఖిల్(17) అనే విద్యార్థి బుధవారం ఇసుక ట్రాక్టర్ ఢీకొని దుర్మరణం చెందాడు. ఊటకూరు గ్రామానికి చెందిన రుతుపర్ణ చక్రవర్తి, గంగాదేవి దంపతుల ఏకైక కుమారుడు అఖిల్ ద్విచక్రవాహనంలో హిందూపురంలోని శ్రీనివాస ఐటీఐ కళాశాల నుంచి స్నేహితుడు లోకేష్‌తో కలిసి స్వగ్రామానికి బయలుదేరాడు. శాసనకోట-జాతీయ రహదారి మధ్యలో పెన్నానది నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ బలంగా ఢీకొనడంతో అఖిల్ అక్కడికక్కడే మృతిచెందగా లోకేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. క్షతగాత్రుడు లోకేష్‌ను 108 సాయంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లోకేష్ కూడా ఐటీఐ చదువుతున్నాడు. అఖిల్ తండ్రి పెయింటర్‌గా, తల్లి గార్మెంట్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఒక్కగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలవడంతో వారి ఆర్తనాదాలు మిన్నంటాయి. ప్రమాదానికి కారణమైన ఇసుక ట్రాక్టర్‌ను పద్మసాయి పాఠశాల వద్ద ఆపి డ్రైవర్ పరారయ్యాడు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని..


ప్రమాదానికి కారణమైన బస్సు

సోమందేపల్లి, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని సురేష్‌రెడ్డి (15) అనే విద్యార్థి దుర్మరణం పాలైన సంఘటన మండలంలోని వెలిదడకల వద్ద బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాచపల్లి హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న సురేష్‌రెడ్డి హిందూపురం రూరల్ మండలం బాలంపల్లి నుంచి స్వగ్రామమైన గోరంట్ల మండలం బోయలపల్లికి సాయంత్రం ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. కదిరి నుంచి హిందూపురానికి వస్తున్న పల్లె వెలుగు ఆర్టీసీ బస్సు వెలిదడకల-పత్తికుంటపల్లి మధ్యలో ఢీకొనడంతో విద్యార్థి అక్కడికక్కడే మృతిచెందాడు. సురేష్‌రెడ్డి అమ్మమ్మ ఇంట్లో ఉంటూ చదువుకుంటున్నట్లు స్థానికులు తెలిపారు. బోయలపల్లిలో ఉన్న తాత అశ్వర్థరెడ్డిని కలవడానికి బయలుదేరినట్లు పేర్కొన్నారు. మార్గమధ్యంలో దుర్మరణం చెందడంతో కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి. సంఘటనా స్థలానికి చేరుకున్నవారు బోరున విలపించడంతో స్థానికులను కంటతడిపెట్టించింది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని రైతు..


బోయనల్లప్ప (ఫైల్)

గార్లదిన్నె, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జంబులదిన్నె కొట్టాల సమీపంలో బుధవారం సాయంత్రం గుర్తు తెలియని వాహనం ఢీకొని బోయ నల్లప్ప (51) అనే రైతు దుర్మణం చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. జంబులదిన్నెకు చెందిన నల్లప్ప గత కొంతకాలం నుంచి సోములదొడ్డిలో నివాసం ఉంటున్నాడు. జంబులదిన్నె కొట్టాల సమీపంలో ఉన్న చీనీ తోటకు ప్రతిరోజూ వచ్చి వెళ్లేవాడు. అందులో భాగంగా బుధవారం చీనీ కాయలు కోయించి... బ్యాగులో కొన్ని కాయలు తీసుకుని ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. శింగనమల వైపు నుంచి గుర్తు తెలియని వాహనం అతి వేగంగా వచ్చి ద్విచక్ర వాహనంలో వెళుతున్న నల్లప్పను ఢీ కొట్టి వెళ్లిపోయింది. ప్రమాదంలో ఆయన అక్కడిక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు వాహనాన్ని పట్టుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదంపై స్థానికులతో ఆరా తీశారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పట్టుకునేందుకు సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బైక్ అదుపుతప్పి..

హిందూపురం, జూలై23(ఆంధ్రజ్యోతి): చిలమత్తూరు మండలంలోని 544-ఈ జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అంజినప్ప(75) అనే వృద్ధుడు మృతిచెందారు. ఎస్ఐ మునీర్ అహ్మద్ తెలిపిన మేరకు, దేమకేతేపల్లి ఎస్సీ కాలనీకి చెందిన అంజినప్ప తన అల్లుడి బైక్‌పై చిలమత్తూరు నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. తుమ్మలకుంట సమీపంలో బైకు అదుపుతప్పి కింద పడ్డారు. దీంతో తీవ్రంగా గాయపడిన అంజినప్ప అక్కడికక్కడే మృతి చెందారు.

ఇద్దరు యువతుల అదృశ్యం

కదిరి, జూలై 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇద్దరు యువతులు బుధవారం అదృశ్యమయ్యారు. పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపిన మేరకు, అడపాల వీధికి చెందిన 19 ఏళ్ల యువతి హైదరాబాదులో నర్సింగ్ చేస్తోంది. రెండు రోజుల కిందట కదిరికి వచ్చింది. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లింది. యువతి తల్లి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గొల్లమ్మ మండపం వీధిలో మరో యువతి బుధవారం అంగడికి అని వెళ్లి తిరిగి రాలేదు. యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

న్యూస్ బాక్స్

పాలపాటిదిన్నె ఆలయ హుండీ లెక్కింపు

నల్లచెరువు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధి చెందిన పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన హుండీ కానుకలను బుధవారం లెక్కించినట్లు ఆలయ ఈఓ మురళీ క్రిష్ణ తెలిపారు. నాలుగు నెలల హుండీని లెక్కించగా రూ.2,85,150 వచ్చిందన్నారు. ఈ లెక్కింపులో తనిఖీ అధికారి ప్రసాద్, ఆలయ అర్చకులు నాగరాజు, ఆంజనేయదాస్, సంజీవ్, ఆయల సిబ్బంది మనోహర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా వర్క్‌ఫైల్ ఉండాలి

బత్తలపల్లి, జూలై 23(ఆంధ్రజ్యోతి): తప్పులు లేకుండా వర్క్ ఫైల్ ఉండాలని ఎంపీడీఓ నరసింహనాయుడు ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. కూలీలు పని చేసే ఫొటోలు తపప్పనిసరిగా వర్క్ ఫైల్ తప్పుతడకలు లేకుండా ఉండాలని తెలిపారు. నిబంధనలు పాటించాలన్నారు. విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్ర మంలో ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు

సరుకుల పంపిణీ

ధర్మవరం, జూలై 23(ఆంధ్రజ్యోతి): శ్రీచౌడేశ్వరి దేవి జయంతి వేడులకలను పట్టణంలోని చౌడేశ్వరి దేవాలయం జ్యోతుల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తొగట వీర క్షత్రియ సేవాసంఘం పట్టణ అధ్యక్షుడు గుద్దిటి రాము తెలిపారు. ఈ మేరకు బుధవారం తొగటవీర క్షత్రియ కల్యాణమండపంలో పట్టణంలోని ఆయా ఆలయ కమిటీ సభ్యులకు వంట సరుకులు అందజేశారు. కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ సేవా సంఘం సభ్యులు గుండా పుల్లయ్య, పరిశే సుధాకర్, చెలిమి శివరాం తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి నీటి ట్యాంకు వితరణ

ధర్మవరం, జూలై 23(ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం మండలం మల్లేపల్లిలో వెలసిన మహాలక్ష్మి ఆలయానికి నీటి ట్యాంకును వితరణ చేసినట్లు స్థానిక యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర తెలిపారు. ధర్మవరం పట్టణానికి చెందిన వంకదారి సుజాతమ్మ జ్ఞాపకార్థం ఆమె భర్త వంకదారి రామచంద్రగుప్త, వారి కుమార్తె నీటి ట్యాంకును ఆలయ ధర్మకర్త ఓబుళేశుకు బుధవారం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ కార్యదర్శి జయరాం, పీఆర్ఓ రాధాకృష్ణ, సభ్యులు డాక్టర్ బీవీ సుబ్బారావు, సత్రశాల మల్లికార్జున పాల్గొన్నారు.

యువకవికి ఆత్మీయ పురస్కారం


ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ నుంచి పురస్కారం అందుకుంటున్న యువకవి

ధర్మవరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో బుధవారం నిర్వహించిన శతాధిక కవి సమ్మేళనంలో తనకు మల్లెల తీగ వారి ఆత్మీయ పురస్కారం లభించినట్లు ధర్మవరం యువకవి రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ పురస్కారాన్ని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ చేతుల మీదుగా అందుకోవడం గర్వంగా ఉందన్నారు. తాను రచించిన 'నీ పేరే రాస్తాను స్వాతంత్ర్యమా' అనే కవితా గానానికి గుర్తింపుగాఈ పురస్కారం అందుకున్నట్లు యువకవి తెలిపారు.

కాకతీయ విద్యానికేతన్‌లో మాక్ ఎన్నికలు

ధర్మవరం, జూలై 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ప్రజాస్వామ్య విధానం పట్ల అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో మాక్ ఎన్నికలు నిర్వహించారు. విద్యార్థులు ఎస్‌పీఎల్(స్కూల్ పీపుల్ లీడర్), ఏఎస్‌పీఎల్ (అసిస్టెంట్ స్కూల్‌పీపుల్ లీడర్) పదవుల కోసం పోటీపడ్డారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నిర్మలాదేవి మాట్లాడుతూ... ప్రజాస్వామ్య విలువలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ మాక్ ఎన్నికలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు శెట్టిపి సూర్య ప్రకాశ్‌రెడ్డి, శెట్టిపి పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ధర్మవరం విద్యార్థి


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ధర్మవరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రిషి విద్యాలయ పాఠశాల విద్యార్థి జాతీయ స్థాయి రోల్‌బాల్ స్కేటింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కరుణ్ స్వరూప్‌సింగ్ తెలిపారు. ఈ నెల 22న కాకినాడలో జరిగిన రోల్‌బాల్ స్కేటింగ్ రాష్ట్ర స్థాయి పోటీలలో పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న గౌరవ్ ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. దీంతో పాఠశాలలో బుధవారం విద్యార్థి గౌరవ్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ భాస్కర్, సీఏఓ రవీంద్ర, వైస్ ప్రిన్సిపాల్ కల్యాణి, ఏఓ రంగారెడ్డి పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

● రూ.36,600 నగదు స్వాధీనం

ధర్మవరం రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగలూరు సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. అందిన సమాచారం మేరకు బుధవారం సిబ్బందితో కలిసి మఫ్టీడ్రస్సులో దాడులు చేశామన్నారు. ఈ దాడులలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి వారివద్ద నుంచి రూ.36,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నాలుగు బొలెరో వాహనాలు సీజ్

ముదిగుబ్బ, జూలై 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ముదిగుబ్బ-పులివెందుల రహదారిలో పులివెందుల వైపు వెళుతున్న బొలెరో వాహనాలలో ప్రమాదకరంగా కూలీలను ఎక్కించుకుని వెళుతుండగా బుధవారం సాయంత్రం దొరిగల్లు సమీపంలో ముదిగుబ్బ అప్‌గ్రేడ్ సీఐ శివరాముడు సీజ్ చేశారు. ఆయన వాహనాలను తనిఖీ నిర్వహిస్తుండగా బొలేరో వాహనాలలో అత్యధికంగా కూలీలను తీసుకెళ్తుండగా వారిని దింపి కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రాణాలతో చెలగాటమాడే ఇలాంటి ప్రయాణాలను అరికట్టాల్సిన అవసరం ఉందని సీఐ తెలిపారు. నాలుగు బొలేరో వాహనాలను కదిరి రవాణా శాఖ అధికారులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించకపోతే చర్యలు

తనకల్లు, జూలై 23(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియమాలను ఆటో డ్రైవర్లు పాటించకపోతే చర్యలు తప్పవని ఎస్ఐ గోపి హెచ్చరించారు. బుధవారం మండలంలోని కొక్కంటి క్రాస్‌లో ఆటో డ్రైవర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. భద్రత నియమాలు, ట్రాపిక్ నిబంధనలు, ప్రమాద నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. వాహనాలను నిబంధనలకు అనుగుణంగా నడపాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. సమస్యలుంటే తమదృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ గోపి, హెడ్‌కానిస్టేబుల్ నాగసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకు నీరు లీకేజీ

● పాఠశాల పక్కన దిబ్బల్లోకి చేరుతున్న వైనం
● దుర్వాసనతో విద్యార్థులకు ఇబ్బందులు

తనకల్లు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాకుంటపల్లిలో బీఎల్ఎస్ ఆర్ నీటి ట్యాంక్‌ను దాదా పు ఇరవై ఏళ్ల క్రితం ని ర్మించారు. బండపైన నీటి ట్యాంక్‌ను నిర్మించడం తో నీటి సరఫరా కోసం అప్ప ట్లో దానికి ఇనుప పైపుల ను ఏర్పాటు చేశారు. గ్రా మానికి నీరు సరఫరా చేసేందుకు కొన్నేళ్ల క్రితం ఆ నీటి ట్యాంక్‌కు ఏర్పాటు చేసిన ఇనుప పైపులు ప్రస్తుతం తుప్పు పట్టి పగలి పోయాయి. దీంతో పైపులు లీకేజీ అవుతూ నీరంతా పాఠశాల పక్కనే ఉన్న దిబ్బల్లోకి వచ్చి చేరి నిల్వ ఉంటోంది. దుర్వాసన వెదజల్లుతోంది. ఈ దుర్వాసనతో పాఠశాలలోని విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి


దిబ్బల పక్కనే ఉన్న పాఠశాల


తుప్పుపట్టిన ఇసుప పైపు

దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాకాలం, దోమలు పెరుగుతున్నాయి. విద్యార్థులు జ్వరాల బారిన పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల పక్కనే మురుగు ఉన్నా అటు పంచాయతీ సిబ్బందికానీ, గ్రామ సచివాలయ ఉద్యోగులు కానీ, వైద్యసిబ్బంది కానీ పాఠశాల పక్కనే ఉన్న కంపుకొడుతున్న దిబ్బల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇప్పటి కైనా అధికారులు స్పందించి వెంటనే వృథా నీటిని అరికట్టి, పాఠశాల వద్ద శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

హామీలన్నీ అమలు చేస్తున్నాం

● ఎమ్మెల్యే సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె


సింగిల్‌విండో కార్యాలయ ఆవరణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పుట్టపర్తి రూరల్, జూలై23(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తు.చ. తప్పకుండా అమలుచేస్తున్నారని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం పుట్టపర్తి ప్రాథమిక సహకార పరపతి సంఘం సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికైన ముమ్మనేని వెంకటరాముడు ప్రమాణస్వీకార అభినందన సభకు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి హాజరయ్యారు. నూతనంగా పదవులు అలంకరించిన సొసైటీ అధ్యక్షుడు ముమ్మనేని వెంకటరాముడు, డైరక్టర్లు రామచంద్ర, ఆంజనేయులును వారు పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పెడపల్లి, మెంగళమ్మ చెరువు సింగిల్‌విండో అధ్యక్షులు విజయ్‌కుమార్, శ్రీరామిరెడ్డి, టీడీపీ పుట్టపర్తి అర్బన్ కన్వీనర్ రామాంజి నేయులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మాజీ జడ్పీటీసీ చెన్నకేశవులు, మునిసిపల్ మాజీ చైర్మన్లు పీసీ గంగన్న, బెస్త చలపతి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు లెక్కల లింగప్ప, వెంకటేష్, సీఈఓ రవి, రమణారెడ్డి, టీడీపీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం నియోజకవర్గంలోని కప్పలబండ గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారమే ప్ర భుత్వ ధ్యేయమన్నారు. ఏడాదికాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమపథకాలను కరపత్రాల ద్వారా ప్రజలకు తెలి యజేశారు. కార్యక్రమంలో సర్పంచు చిన్నపెద్దన్న, ఎంపీటీసీ మధురిమ, మారుతీనాయుడు, నాయకులు శ్రీరాంనాయక్, బొమ్మయ్య, పుల్లప్ప, లెక్కల గోపాల్, మాజీసర్పంచు చంద్రశేఖర్, విశ్వనాథ్, శివశంకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్దకమ్మవారిపల్లిలో ఇటీవల అనా రోగ్యంతో మృతిచెందిన టీడీపీ క్రియాశీలక కార్యకర్త కిష్టప్ప కుటుంబ సభ్యులను పరామర్శించారు.

● బుక్కపట్నం: ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి బుధవారం మండలంలోని జానకంపల్లిలో బాధిత పలు కుటుంబాలను పరామర్శించారు. వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. టీడీపీ మండల కన్వీనర్ చింతా మల్లిరెడ్డి, గోపాలపురం గంగాధర్, శ్రీనివాసరెడ్డి, మురళీ, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసుకున్న వ్యాపారులపై కేసు

కదిరి, జూలై 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇద్దరు చికెన్ వ్యాపారులు బుధవారం పరస్పరం దాడి చేసుకోవడంతో ఇరువురిపై కేసులు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణ రెడ్డి తెలిపారు. పట్టణంలోని రాయ చోటి రోడ్డులో షాకీర్ అనే వ్యక్తి చికెన్ వ్యాపారం చేస్తున్నాడు. అతడి వద్ద చికెన్ కొని నిజాంవలి కాలనీకి చెందిన నజీర్‌ఖాన్, అహ్మద్ ఖాన్ పీవీఆర్ బార్ వద్ద, జీవిమాను సర్కిల్ వద్ద చికెన్ పకోడి వ్యాపారం చేస్తున్నారు. షాకీర్ వద్ద నజీర్‌ఖాన్ కొన్నేళ్ల నుంచి చికెన్ కొంటున్నాడు. రూ.70వేలు అప్పు పడ్డాడు. అప్పు విషయమై ఇరువురు గొడవపడి దాడి చేసుకొని గాయపడ్డారు కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

తనకల్లు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కొక్కంటి క్రాస్‌లో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ గాయపడింది. గీతాలవారిపల్లికి చెందిన ఆకుల చంద్రమ్మ సొంత పనిమీద కొక్కంటి క్రాస్‌కు వచ్చింది. ఇక్కడ రోడ్డు దాటుతున్న ఆమెను లారీ ఢీకుంది. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆమెను వందేమాతరం అంబులెన్స్‌లో తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కదిరి ప్రభుత్వ ఆసుప్రతికి తరలించారు.

దాడిలో గాయపడిన వృద్ధురాలి మృతి


సరస్వతి (ఫైల్)

గాండ్లపెంట, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి దాడిలో తీవ్రంగా గాయపడిన మండలంలోని బనాన్‌చెరువుపల్లికి చెందిన సరస్వతి అనే వృద్ధురాలు మృతిచెందినట్లు బుధవారం పోలీసులు తెలిపారు. బనాన్‌చెరువుపల్లికి చెందిన సరస్వతి ఇంట్లో దోచుకోవ డానికి పదిరోజుల క్రితం ఓ వ్యక్తి వచ్చాడు. గమనించిన ఆమె కేకలు వేయగా అతడు కట్టెతో తలపై ఆమెను కొట్టాడు. దీంతో అపస్మారక స్థితిలో పడిఉన్న ఆమెను కటుంబసభ్యులు అనంతపురం తరలించారు. అక్కడ చికిత్సల నంతరం స్వగ్రామానికి తీసుకురాగా మంగళవారం రాత్రి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై కేసు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ గంగాధర్ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థికసాయం

గాండ్లపెంట, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడ్డివెలగల పంచాయతీలోని నరసప్పగారిపల్లికి చెందిన టీడీపీ క్రియాశీలక కార్యకర్త రెడ్డిశేఖర్ కుటుంబానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ రూ.50వేలు ఆర్థికసాయం అందించారు. రెడ్డి శేఖర్ ఈ యేడాది ఏప్రిల్‌లో రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. దీంతో ఎమ్మెల్యే అందించిన ఆర్థిక సాయాన్ని బుధవారం గొడ్డివెలగల క్లస్టర్ ఇన్‌చార్జ్ ప్రసాద్, మాజీ ఎంపీటీసీ వీరమనాయుడు నర్సప్పగారిపల్లిలో మృతుడి తండ్రి నారాయణకు అందజేశారు. పార్టీలో క్రియాశీలక సభ్యుడుగా ఉండి, పార్టీ బలోపేతానికి ఎంతో కృషిచేశారన్నారు. మృతుని తల్లిదండ్రులను ఆదుకోవడానికి ఎమ్మెల్యే సాయం చేశారన్నారు. అలాగే మృతుడు పార్టీ సభ్యత నమోదు తీసుకుని ఉండడంతో ప్రమాద బీమా రూ.5లక్షలు అందేలా త్వరలో కృషిచేస్తానని ఎమ్మెల్యే చెప్పినట్లు చెప్పారు.

టీడీపీ నాయకుల ఇంటింటి ప్రచారం



నల్లమాడ, జూలై23(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్ వీధిలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్, బుట్ట నాగభూషణ నాయుడు, కోట్లో మంజునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమావత్ భారతి, సోను, మైలే రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పి-4పై గ్రామ సభ

తనకల్లు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలసముద్రం గ్రామంలో పి-4పై బుధవారం గ్రామ సభను ఎంపీడీఓ రామానాయక్, సర్పంచ్ జయమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. పి-4 విధానంలో అవసరమున్న వారిని గుర్తించే సర్వే ఎలా చేపట్టాలో వివరించారు. సమావేశంలో సచివాలయ, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



గేమేనాయక్ తండా గ్రామ సచివాలయం

సమయపాలన పాటించని ఉద్యోగులు

తనకల్లు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గేమేనాయక్‌తండా గ్రామ సచివాల యంలో ఉద్యోగులు సమయ పాలన పాటించడంలేదని గ్రామస్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సచివాలయానికి బుధవారం ఉదయం 12 గంటలైనా ఉద్యోగులు చాలామంది హాజరుకాలేదు. కేవలం డిజిటల్ అసిస్టెంట్, ఏఎన్‌ఎం మాత్రమే హాజరయ్యారు. మిగిలినవారు హాజరుకాకపోవడంతో వివిధ పనుల కోసం వచ్చిన ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు వేచి చూశారు. అయినా ఆ ఉద్యోగులు రాకపోవడంతో.... ఇలా అయితే తమ సమస్యలు పరిష్కారం అయ్యేది ఎలా? అంటూ శాపనార్థాలు పెట్టుకుంటూ వెళ్లిపోయారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు రోరుతున్నారు.


మధ్యాహ్నం 12 గంటలైనా ఖాళీగా ఉన్న ఉద్యోగుల కుర్చీలు

జనసేన భారీ బైక్ ర్యాలీ


ధర్మవరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న చిలకం మధుసూదన్‌రెడ్డి తదితరులు

ధర్మవరం, జూలై 23(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా గురువారం విడుదల కానున్న సందర్భంగా విజయవంతం కావాలంటూ జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో భారీ బైకు ర్యాలీ నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ఈ బైకు ర్యాలీని రంగా థియేటర్ వరకు కొనసాగించారు. అనంతరం పవన్‌కళ్యాన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు అడ్డగిరి శ్యాంకుమార్, మత్స్యకార వికాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెస్త శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

● కొత్తచెరువు: హరిహర వీరమల్లు చిత్రం విజయవంతం కావాలని జనసేన నాయకులు, కార్యకర్తలు బుధవారం సాయంత్రం మండల కేంద్రంలో బైకు ర్యాలీ నిర్వహించారు. జనసేన పార్టీ నాయకులు చంద్రశేఖర్, మండల కన్వీనర్ పూలశివప్రసాద్ ఆధ్వర్యంలో ర్యాలీ సాగింది.

● కదిరిఅర్బన్: హరిహర వీరమల్లు సినిమా వియజవంతం కావాలంటూ బుధవారం పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భైరవప్రసాద్ ఆధ్వర్యంలో సాగిన ర్యాలీలో నాయకులు శివ శంకర్, చిన్నప్పరెడ్డి, లక్ష్మణ్, చౌదరి, ఆంజి, రవికుమార్ తదితరులు ఉన్నారు.

● గాండ్లపెంట/తనకల్లు : హరిహర వీరమల్లు చిత్రం విజయవంతం కావాలని జనసేన మండల కన్వీనర్ రవినాయక్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రామస్వామి ఆలయంలో 101 టెంకాయలు కొట్టారు. జనసేన నాయకులు మోహన్, రవి, మధు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు. అలాగే తనకల్లు మండలంలోని కొక్కంటి క్రాస్ నాలుగురోడ్ల కూడలిలో జనసేన నాయకులు అన్నదానం చేపట్టారు. నాయకులు అమర్‌కార్తికేయ, రమణ, న్యాయవాది కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జలధికి తరలిన ఉరుసు పీర్లు


జౌకల కొత్తపల్లిలో కొలువుదీరిన పీర్లు

అమడగూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మొహర్రం సందర్భంగా మండలంలోని జౌకల కొత్తపల్లిలో కొలువుదీరిన ఉరుసు పీర్లను జలధికి తరలించారు. బుధవారం ఉదయం ఉరుసు పీరు, ఉక్కుపీరును గ్రామంలోని ప్రతి ఇంటా ఊరేగిస్తూ చదివింపులు, ముడుపులు స్వీకరించారు. సాయంత్రం జలధికి తరలించారు.

బాలుర వసతి గృహం తనిఖీ

● వసతులు లేవని తహసీల్దార్‌కు విద్యార్థుల ఫిర్యాదు

ధర్మవరం, జూలై 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుట్టకిందపల్లి బాలుర వసతి గృహాన్ని బుధవారం రాత్రి తహసీల్దార్ సురేశ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతిగృహంలో సమస్యలు, భోజనం నాణ్యత తదితర విషయాలను విద్యార్థులను తహసీల్దార్ అడిగితెలుసుకున్నారు. మరుగుదొడ్లు సక్రమంగా లేవని, గదులలో ఫ్యాన్‌లు లేవని, దోమలు అధికంగా ఉన్నాయని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆరోగ్య సిబ్బంది కూడా హాస్టల్‌కు రా వడంలేదన్నారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ అన్ని సౌకర్యాలు ఉంటాయని తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో హాస్టల్‌లో ఉంచితే వారి పట్ల నిర్లక్ష్యంగా ఉండటం ఏమిటని అక్కడ సిబ్బందిని ప్రశ్నించారు. ఆయన వెంట వీఆర్ఓ రవిశేఖర్‌రెడ్డి ఉన్నారు.

దర్శినమలలో వైద్య బృందం పర్యటన

ఆంధ్రజ్యోతి స్పందన

ధర్మవరం రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్శినమల గ్రామంలో బుధవారం వైద్య బృందం పర్యటించింది. గ్రామంలో రామాంజినేయులు అనే వ్యక్తి విషజ్వరంతో బాధపడుతూ మృతిచెందాడనే వార్త ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై స్పందించిన వైద్యాధికారి డాక్టర్ దిలీప్‌కుమార్, అసిస్టెంట్ మలేరియా అధికారి లక్ష్మీనాయక్ వైద్య సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించారు. ముందుగా మృతిచెందిన రామాంజినేయులు ఇంటివద్దకు వెళ్లి కుటుంబసభ్యులతో మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. వైద్య పరీక్షల రికార్డులు పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరిగి జ్వరపీడితులు, నీటితొట్టెలలో లార్వాపై సర్వే చేశారు. ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అపరిశుభ్ర ప్రాంతాల్లో మిలాథిన్‌ను స్ప్రేయింగ్ చేయించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ సాంబశివమ్మ, మలేరియా సబ్ యూనిట్ అధికారి జయరాంనాయక్, హెల్త్‌సూపర్‌వైజర్ రాజశేఖర్‌రెడ్డి, హెల్త్‌అసిస్టెంట్ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి మనోహర్, ఏఎన్‌ఎం స్రవంతి, మహిళ పోలీస్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

గాండ్లపెంట, జూలై 23(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని స్థానిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ బాబా ఫకృద్దీన్ పేర్కొన్నారు. ఆయన బుధవారం మండలంలోని కటారుపల్లి క్రాస్‌లో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాన్ని సందర్శించారు. విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలను వివరించారు. హెల్త్ ఎడ్యుకేటర్ విజయ్, సూపర్‌వైజర్ ఉపేంద్రారెడ్డి, విజయకుమార్, సీహెచ్‌ఓ లక్ష్మీ, ఎస్‌ఓ దర్గ తదతరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా సునీల్ వైట్ల

పుట్టపర్తి రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): భారతీయజనతాపార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా పుట్టపర్తికి చెందిన సునీల్‌వైట్లను ఎంపిక చేసినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ బుధవారం ఓప్రకటనలో తెలిపారు. ఆయన్ను రెండోసారి ఈపదవి వరించింది. ఆయన ఎంపికపై బీజేపీ పట్టణ కమిటీ హర్షం వ్యక్తం చేసింది.

రేషన్ డీలర్ల పట్టణ, మండల కమిటీల ఏర్పాటు


అధ్యక్షుడు మనోహర్

కదిరి అర్బన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల అసోషియేషన్‌ను పట్టణ, మండల కమిటీని ఏకగ్రీవంగా ఏర్పాటు చేసినట్లు ఆ కమిటీ అధ్యక్షుడు జి. మనోహర్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ మురళీక్రిష్ణ, సీఎస్‌డీటీ రవిప్రసాద్, స్టాక్ పాయింట్ ఇన్‌చార్జ్ నాగేంద్రకుమార్ సమక్షంలో కమిటీని ఎంపిక చేశామన్నారు. ఉపాధ్యక్షుడిగా ఎం. గిరిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా జి. మునిరత్నం, కోశాధికారిగా సులేమాన్, సభ్యులుగా రాజశేఖర్, పురుషోత్తం, లక్ష్మీరెడ్డి, జిలాన్, బాబు, సరస్వతమ్మ, గిరిచరణ్ ఎన్నుకున్నట్లు తెలిపారు. డీలర్ల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషిచేస్తామని అధ్యక్షుడు మనోహర్ తెలిపారు.

బుక్కపట్నం మండల అధ్యక్షుడిగా బళ్లారి హరి

బుక్కపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్టోర్ డీలర్ల సంఘం మండల కమిటీ అధ్యక్షుడిగా బళ్లారి హరిని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఆయనను టీడీపీ నాయకులు సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. డీలర్లకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని పేర్కొన్నారు.

వడ్డెర సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నియామకం

ఓబుళదేవరచెరువు, జూలై 23(ఆంధ్రజ్యోతి): వడ్డెర్ల సంక్షేమ సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా మండలంలోని నల్లగుట్లపల్లికి చెందిన కుచ్చెపు ఆంజనేయులును నియమించారు. ఈ మేరకు ఆదిష్టానం తనకు ఉత్తర్వులు ఇచ్చినట్లు ఆంజనేయులు బుధవారం తెలిపారు. తన ఎంపికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది వేముల బేబిరాణి, యువజన శాఖ రాష్ట్ర కన్వీనర్ డేరంగుల ఆంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంజునాథ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అనుచిత వ్యాఖ్యలు చేశాడని ఫిర్యాదు

ఓబుళదేవరచెరువు, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఓ దినపత్రిక విలేకరిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ నాయకుడు పీట్ల సుధాకర్‌పై చర్యలు తీసుకోవాలని స్థానిక పాత్రికేయుల కమిటీ సభ్యులు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వార్తల్లో తమ పేరు రాయలేదని విలేకరిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ హెడ్‌కానిస్టేబుల్ రమేష్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు.

యాంత్రీకరణ పద్ధతులతో అధిక దిగుబడులు

● అసోసియేట్ డీన్ సరోజినీదేవి



ఆముదం విత్తనాలను పంపిణీ చేస్తున్న సరోజినీదేవి

మడకశిర రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో యాంత్రీకరణ పద్ధతులను అనుసరిస్తే అధిక దిగుబడులు సాధ్యమని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సరోజినీదేవి అన్నారు. భారత వ్యవసాయ పరిశోధనా మండలి న్యూఢిల్లీ సౌజన్యంతో కళాశాలలో ఆముదం పంట సాగుపై ఆర్ అనంతపురం చీపులేటీ, రేకులకుంట, గౌడనహళ్లి గ్రామాలకు చెందిన 36 మంది ఎస్సీ రైతులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సరోజనిదేవి ఎస్సీ రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం హైబ్రిడ్ ఆముదం విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ సమన్వయకర్త డాక్టర్ శ్రీగిరి, వ్యవసాయ యాంత్రీకరణ విభాగం అధిపతి డాక్టర్ హరిబాబు, బోధనా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గొర్రెల కాపరుల సంక్షేమం కోసమే షెడ్లు

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి



షెడ్లను పరిశీలిస్తున్న గుండుమల తిప్పేస్వామి

అగళి, జూలై 23(ఆంధ్రజ్యోతి): గొర్రెల కాపరుల సంక్షేమం కోసమే ప్రభుత్వం షెడ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. మండలంలోని పూలపల్లి గ్రామానికి చెందిన రైతు తిప్పేస్వామి గొర్రెల షెడ్లను నిర్మించారు. ఉపాధిహామీ పథకం ద్వారా నిర్మించిన ఈ షెడ్డును ఆయన పరిశీలించారు. షెడ్డు ఎంతో ఉపయోగకరంగా ఉందని గొర్రెలకు ఇబ్బందులు లేకుండా ఉందన్నారు. అనంతరం కొల్లాపురమ్మ దేవి ఉత్సవాల్లో ఆయన పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

'ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి'

అగళి, జూలై 23(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారించాలని జడ్పీటీసీ ఉమేష్, వ్యవసాయశాఖ అధికారి నాగరాజు సూచించారు. అగళి మండల కేంద్రంలో బుధవారం ప్రత్యామ్నాయ పంటలకు సంబంధించిన విత్తనాలను పంపిణీ చేశారు. కందులు, రాగులు, మినుములు, సంచులు రైతులకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతుసేవా కేంద్రాల్లో వీటిని పంపిణీ చేయడం జరుగుతోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హత ఉన్న ప్రతి రైతు వచ్చి తీసుకెళ్లాలన్నారు.

ఆర్థికసాయం అందజేత

మండల కేంద్రానికి చెందిన పారిశుధ్య కార్మికుడు మంజునాథ్ 15రోజుల క్రితం అనారోగ్యంతో తుమకూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన మృతిచెందాడు. ఆ కుటుంబానికి జడ్పీటీసీ ఉమేష్, కోకన్వీనర్ శివన్న బుధవారం రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ లక్ష్మమ్మ, హనుమంతరాయప్ప తదితరులు ఉన్నారు.

ఆస్తి పన్నులు తగ్గడంతో రీ సర్వే



భవనాల కొలతలు వేస్తున్న మున్సిపల్ అధికారులు

మడకశిర టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): పంచాయతీకి వచ్చే ఆదాయం గతంకన్నా తగ్గడంతో అధికారులు పట్టణంలో మరోసారి రీ సర్వే చేపట్టారు. బుధవారం పట్టణంలో పలు వార్డులలో రీసర్వే చేశారు. ఆస్తి పన్ను పెరగాల్సి ఉన్నా తగ్గడంతో అనంతపురం, హిందూపురం తదితర మున్సిపాలిటీల నుంచి అధికారులు మడకశిర నగర పంచాయతీకి వచ్చి రీ సర్వే చేపట్టారు. 2021-22 వస్తున్న ఆస్తి పన్ను ప్రస్తుతం రావడం లేదని దీంతో పన్ను ఎలా తగ్గింది..? అన్నదానిపై అధికారులు పరిశీలిస్తున్నారు. రీ సర్వే నిర్వహించిన అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

కోర్టుకు హాజరైన టీడీపీ నాయకులు

రొద్దం, జూలై 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయంలో పార్టీ ఆదేశాల మేరకు దళిత నాయకులు అనంతపురంలోని కలెక్టరేట్ ముట్టడికి వెళ్లగా కేసు నమోదుకావడంతో కోర్టుకు హాజరయ్యారు బుధవారం హిందూపురం పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు ఇతర నాయకులు అనంతపురం కోర్టుకు హాజరయ్యారు. 14 మందిపై కేసులు నమోదయ్యాయన్నారు.

టిప్పర్ సీజ్

పరిగి, జూలై 23(ఆంధ్రజ్యోతి): పరిగి చెరువులో మంగళవారం రాత్రి ప్రభుత్వ అనుమతులు పొందకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసినట్లు జమేదార్ శ్రీనివాసులు తెలిపారు. చెరువు నుంచి ఇటుక బట్టీలకు అక్రమంగా మట్టిని తరలిస్తున్న హిందూపురానికి చెందిన టిప్పర్ లారీని శ్రీరంగరాజులపల్లికి వెళ్లేదారిలో సీజ్ చేసినట్లు తెలిపారు. అక్రమంగా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కందుల పంపిణీ

రొద్దం, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆర్.లోచర్లలో ప్రభుత్వం రైతులకు అందించే ఉచిత కందుల బ్యాగులను టీడీపీ నాయకులు బుధవారం పంపిణీ చేశారు. రైతు సేవా కేంద్రంలో 300 బ్యాగులు ప్రభుత్వం సరఫరా చేయగా వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేమన్న, మురళి, ముత్యాలు, మహేష్, మారుతి, రామాంజినేయులు, శ్రీనివాసులు, సచివాలయ ఉద్యోగులు జాఫర్, యోగేష్ పాల్గొన్నారు.

'ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త వహించాలి'

అగళి, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రమాదాలు జరగకుండా ఆటో డ్రైవర్లు జాగ్రత్త వహించాలని ఎస్ఐ వీరేష్ సూచించారు. బుధవారం ఆటోడ్రైవర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దన్నారు. మద్యం సేవించి ఆటో నడపరాదని సూచించారు.

కురిసిన వర్షం.. రైతన్న హర్షం

● 2.19 లక్షల హెక్టార్లకుగాను 36 వేల హెక్టార్లలో పంటల సాగు

● వేరుశనగ సాగులో రైతులు బిజీబిజీ

మడకశిర, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు వరుణుడు కరుణించాడు. దీంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయిన నెలన్నర తరువాత వర్షం బాగా కురిసింది. వేరుశనగసాగు చేసేందుకు భూమిలో తేమ బాగుండడంతో రైతన్నలు సాగుకు సిద్ధమయ్యారు. గత ఏడాది వర్షం కురవకపోవడంతో వేరుశనగ సాగును విడతలవారీగా చేయాల్సి వచ్చింది. అయితే వర్షం సరిగా పడకపోవడంతో ఆ పంట కాస్త దెబ్బతిని రైతులు పంటను నష్టపోయారు. ఈయేడు ఖరీఫ్‌లో అదునుదాటిపోతున్న సమయంలో వర్షం బాగా కురిసిందని, దీంతో దేవుడిపై భారంవేసి వేరుశనగ పంటను సాగు చేసేందుకు సిద్ధమవుతున్నామని రైతులు అంటున్నారు.

జిల్లావ్యాప్తంగా ఖరీఫ్‌లో నార్మల్ ఏరియా 2.19లక్షల హెక్టార్లకు ఇప్పటి వరకు 36 వేల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. వేరుశనగ నార్మల్ ఏరియా 1.51లక్షల హెక్టార్లకు గాను 22, 500హెక్టార్లలో వేరుశనగ సాగు చేశారు. వేరుశనగ పంటను ఈనెలాఖరు వరకు సాగు చేసుకోవచ్చునని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తూ వచ్చారు. ఇక కంది, ఆముదం ఆగస్టులో కూడా సాగు చేసుకోవచ్చునని వారు పేర్కొంటున్నారు. గత రెండు రోజుల్లోనే జిల్లాలో 20 వేలహెక్టార్ల పంటలు సాగు చేశారు.

రెండు రోజుల్లోనే పది వేల ఎకరాల్లో సాగు

ఖరీఫ్‌లో నెలన్నరపాటు వర్షం కురవలేదు. వరుణుడు కరుణించి రెండు రోజుల క్రితం వర్షం పడడంతో నియోజకవర్గంలోని రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం, మడకశిర మండలాల్లో పది వేల ఎకరాలలో వేరుశనగ పంటను రైతులు సాగు చేశారు. వర్షం పదును పైన పడడంతో భూమిలో తేమ కూడా బాగా ఉంది. దీంతో మరో నాలుగు రోజులపాటు వేరుశనగ సాగు చేసుకోవచ్చునని రైతులు అంటున్నారు.



వేరుశనగ విత్తుతున్న రైతులు

వర్షం పడకపోయి ఉండుంటే బీడుగా వదిలేసేవాడిని



గత యేడు వేరుశనగ పంట దెబ్బతిని నష్ట నష్టపోయాం. ఈ ఏడాదన్నా వేరుశనగ పంట సాగు చేసి అప్పుల ఊబినుంచి బయటపడదామని గంపెడు ఆశతో వేరుశనగ సాగుకు సిద్ధమయ్యాం. నెలన్నర రోజులు వర్షం పడలేదు. రెండు రోజుల క్రితం వర్షం పడింది. పడకపోయివుంటే రెండు ఎకరాలు బీడుగా వదిలేసేవాడిని. వరుణుడు కరుణించి వర్షం పడడంతో దేవుడిపై భారం వేసి వేరుశనగ పంట సాగు చేస్తున్నా.

-శ్రీనివాసులు, రైతు, మడకశిర

36వేల హెక్టార్లలో పంటల సాగు

జిల్లాలో నార్మల్ ఏరియా 2.19 లక్షల హెక్టార్లు ఉండగా అందులో ఇప్పటి వరకు 36 వేల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. వేరుశనగ 1.51 లక్షల హెక్టార్లు నార్మల్ ఏరియా ఉండగా ఇందులో 22 వేల హెక్టార్లలో వేరుశనగ పంట సాగయ్యింది. ఆగస్టు మొదటివారం వరకు వేరుశనగ పంట సాగు చేసుకోవచ్చు. కంది, ఆముదం పంటలు ఆగస్టు నెలాఖరు వరకు కూడా వేసుకోవచ్చు.

-వైవీ సుబ్బారావు, వ్యవసాయశాఖ జేడీ

వైసీపీ నాయకులవి అసత్య ఆరోపణలు

ఆ పార్టీ ఐదేళ్లలో చేయని అభివృద్ధి ఏడాదిలో చేసి చూపించాం

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



శ్వేతపత్రం విడుదల చేస్తున్న ఎంఎస్ రాజు, గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని, గత వైసీపీ ఐదేళ్లపాలన చేయలేని అభివృద్ధిని ఏడాదిలో చేసి చూపామని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. కూటమి ప్రభుత్వంలో కక్షసాధింపులు ఉంటే వైసీపీ నేతలు బయట ఉండేవారాఅని ప్రశ్నించారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారాలోకేశ్‌పై అసత్య ఆరోపణలు, అవాక్కులు, చవాక్కులు పేలితే సహించేది లేదన్నారు. ఏడాదిలోనే 10, 710కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు నియోజకవర్గంలో చేపట్టామని, అందుకు సంబంధించి బహిరంగా చర్చకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. ఏడాది పాలనపై చేసిన అభివృద్ధికి సంబంధించి త్వరలో శ్వేత పత్రం విడుదల చేస్తామని తెలిపారు. అవగాహన లేని మడకశిర వైసీపీ సమన్వయ కర్త ఈరలక్క తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. హోంమంత్రి పర్యటన విజయంతం అయితే జీర్ణించుకోలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. వైసీపీ నాయకులు బహిరంగా చర్చకు వస్తే తానే వచ్చి గత ఐదేళ్ల వైసీపీ హయాంలో అవినీతి, అక్రమాలను వివరిస్తానన్నారు. ఆ అవినీతిని కప్పించుకోనేందుకు తమపై తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. మీ పార్టీకి చెందిన మీ జడ్పీటీసీ మీ వైసీపీ నేతలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు పెడితే మేము అందులో జోక్యం చేసుకోలేదని, తమపై ఆరోపణలు మానుకోవాలని హితవుపలికారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో 600 విద్యుత్ ట్రాన్స్ పార్మర్లు పంపిణీ చేశామన్నారు. మీ హయాంలో ఒక్క ట్రాన్స్ పార్మర్‌కు రూ.50వేల నుంచి లక్ష చొప్పున వసూలు చేయలేదా అంటూ ప్రశ్నించారు. నేషనల్ హైవే, వక్క మార్కెట్‌కు 10 ఎకరాల భూమి కేటాయించి ఆగస్టులో వ్యవసాయశాఖ మంత్రి శంకుస్థాపన చేస్తారన్నారు. 10 శాతం స్టేడియం పనులు 5 ఏళ్లలో పూర్తి చేయలేదని, కేవలం తాను ఎమ్మెల్యే అయ్యాక 3 నెలలో పూర్తి చేసి ప్రారంభించడం జరిగిందన్నారు. నగర పంచాయతీ పరిధిలో కోటి రూపాయలతో సీసీ రోడ్లు నిర్మాణం పూర్తికాగా, అహుడా లే అవుట్ వర్క్ రూ. 5కోట్లతో టెండర్ పూర్తి అయినట్లు తెలిపారు. గత ఐదేళ్లలో ఏ పంచాయతీకి మీరు రూపాయి నిధులు ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతి పంచాయతీకి రూ. 5.10కోట్లు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ కేటాయించడం జరిగిందన్నారు. హాస్టళ్లలో సదుపాయాల కోసం 5 మండలాల పరిధిలో రూ. కోటి టెండర్లు పిలిచామని అన్నారు. గురుకుల పాఠశాలలు నిర్మాణం 80శాతం పూర్తి అయిన తక్కిన పనులు పూర్తి చేయలేని అసమర్థులు వైసీపీ నాయకులు అని అన్నారు. రూ.2 కోట్లతో అగళి, అమరాపురంలో ఆసుపత్రుల నిర్మిస్తుంటే వైసీపీ కళ్లు కనబడడం లేదా అన్నారు. మడకశిర నియోజకవర్గం వ్యాప్తంగా రూ. 15కోట్లతో గ్రామాలలో సీసీ రోడ్లు వేస్తే వైసీపీ నేతలకు, జగన్ పత్రికకు కనపించలేదని ఎద్దేవా చేశారు. ప్రజలకు అబద్ధాలు చెప్పడమే వైసీపీ నాయకులు లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. మందుగుండు పరిశ్రమ నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే పచ్చజెండా ఊపిందని, సెప్టెంబరులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర హోంమంత్రి కూడా పర్యటించే అవకాశాలు ఉన్నాయని, వారి చేతుల మీదుగా శంకుస్థాపన జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను విమర్శించేస్థాయి మీకు లేదు: జడ్పీటీసీ

అగళి: ఎమ్మెల్యే ఎంఎస్‌రాజును విమర్శించే స్థాయి వైసీపీ ఇన్‌చార్జి ఈరలక్కప్పకు లేదని జడ్పీటీసీ ఉమేష్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. విద్యుత్‌సబ్‌స్టేషన్లు, సీసీరోడ్లు, సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్న ఘనత ఎమ్మెల్యేకు దక్కుతుందన్నారు. సమావేశంలో మండల కన్వీనర్ మధుడి తిప్పేస్వామి, సింగిల్ విండో అధ్యక్షులు కుమారస్వామి, మాజీ ఎంపీటీసీ మల్లికార్జున పాల్గొన్నారు.

అభివృద్ధి కనబడదా..?

అమరాపురం: నియోజకవర్గంలో ప్రభుత్వం ఏర్పడి సంవత్సరకాలంలో రూ. కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని, అవి వైసీపీ సమన్వయకర్త ఈరలక్కప్పకు కనపడలేదా అని టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షులు జయకుమార్, చెన్నప్ప అన్నారు. తప్పుడు ఆరోపణలు మానుకోవాలని వారు ఆయనకు హితవుపలికారు.

విమర్శలు మానుకోవాలి: టీడీపీ

రొళ్ల: ఎమ్మెల్యే ఎంఎస్‌రాజుపై వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప చేస్తున్న విమర్శలను మానుకోవాలని టీడీపీ నాయకులు హితవుపలికారు. బుధవారం పాత్రికేయుల సమావేశంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ గురుమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరానికే అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఈరన్న, సింగిల్‌విండో అధ్యక్షుడు దాసిరెడ్డి పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలను దత్తత తీసుకోండి: ఆర్డీఓ



తురకలాపట్నంలో పి-4 గ్రామసభలో పాల్గొన్న ఆర్డీఓ ఆనంద్‌కుమార్

రొద్దం, జూలై 23(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పేదరికంతో మగ్గుతున్న బంగారు కుటుంబాలను ఉన్నతస్థాయి కుటుంబాలు దత్తత తీసుకోవాలని పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ ఆదేశించారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో 'బంగారు కుటుంబాలకు తూట్లు' కథనానికి స్పందించి రొద్దం మండల పరిధిలోని తురకలాపట్నం గ్రామంలో జరుగుతున్న పీ-4 గ్రామసభకు ఆర్డీఓ ఆనంద్‌కుమార్ హాజరై మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు దిశ, నిర్దేశం చేశారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం పీ-4 విధానం ప్రారంభించిందన్నారు. సమాజంలో అట్టడుగున ఉన్నవారిని గట్టెక్కించేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు సాయంగా ప్రజాసేవకు సహాయపడాలన్నారు. మండల వ్యాప్తంగా బంగారు కుటుంబాల గ్రామసభలను చిత్తశుద్ధితో చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రొద్దం కస్తూర్బా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి సదుపాయాలపై విద్యార్థులతో ఆరాతీశారు. విద్యార్థులకు ఆర్డీఓ భోజనం వడ్డించారు. అదేవిధంగా గౌరాజుపల్లి గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. ఆయన వెంట తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు, ఎంపీడీఓ రాంకుమార్, రీసర్వే డీటీ చంద్రశేఖర్, వీఆర్‌ఓ అనీల్‌కుమార్, టీడీపీ నాయకులు కేపీ శ్రీనివాసులు, మాజీ డీలర్ శ్రీనివాసులు, బోయ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎట్టకేలకు గ్రామసభలు

మండలంలో అలసత్వంగా జరుగుతున్న పీ-4 గ్రామసభలు ఆంధ్రజ్యోతి కథనంతో ఎట్టకేలకు బుధవారం నిర్వహించారు. రెడ్డిపల్లి, దొడగట్ట, తాడంగిపల్లి గ్రామాల్లో ఈఓఆర్డీ గోవిందప్ప, పంచాయతీ కార్యదర్శి జనార్దన్ గ్రామసభలు నిర్వహించారు. ఆంధ్రజ్యోతి కథనంపై జిల్లా పీ-4 మానిటరింగ్ కమిటీ అధికారులు ఎంపీడీఓకు ఫోన్‌చేసి ఆరాతీసినట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో పీ-4సర్వేపై ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ద్వారా సమాచారం పొందుపరచాలన్నారు. అలసత్వం వహించకుండా పంచాయతీ కార్యదర్శులు విధులను నిర్వర్తించాలని, పునరావృతం అయితే కఠిన చర్యలుతప్పవని హెచ్చరించారు.

పరిశ్రమలో కార్మికుడికి గాయాలు

హిందూపురం, జూలై 23(ఆంధ్రజ్యోతి): గోళ్లాపురం పారిశ్రామికవాడలోని స్టీల్ పరిశ్రమలో రోలింగ్ మిల్లు విభాగంలో పనిచేస్తున్న కార్మికుడు అనూప్ తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. మంగళవారం సాయంత్రం ప్రమాదం జరిగింది. ప్రమాదంలో అనూప్ కుడికాలు తెగిపోయింది. ఈఎస్ఐ, పీఎఫ్ లేకపోవడంతో పరిశ్రమ యాజమాన్యం సమాచారం బయటకు పొక్కకుండా గోప్యంగా ఉంచింది. బెంగళూరులో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సలు చేయిస్తున్నారు. తూమకుంట పారిశ్రామివాడ కార్మిక సంఘం అధ్యక్షులు రవికుమార్ పరిశ్రమ యాజమాన్యాన్ని సంప్రదించగా వారు సమాచారం చెప్పడానికి నిరాకరించారు. దీనిపై కార్మికశాఖ, పరిశ్రమల అధికారులకు ఫిర్యాదు చేశారు. అతనికి చికిత్స పొందేవరకు ఖర్చులు భరించాలని, చట్టం ప్రకారం అంగవైకల్యానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ సమస్య పరిష్కరించండి

ట్రాన్స్‌కో ఏఈకి రాగిమేకపల్లి వాసుల వినతి

రొద్దం, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాగిమేకపల్లి గ్రామంలో రాత్రి సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని, సమస్యను పరిష్కరించాలని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసమూర్తికి గ్రామస్థులు విన్నవించారు. బుధవారం రొద్దంలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో ఏఈని కలిసి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరారు. రాత్రిపూట విద్యుత్ సరఫరా కాకపోవడంతో ఇబ్బందులకు గురి అవుతున్నామని, సమస్య పునరావృతం కాకుండా చూడాలని కోరారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఏఈ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు అక్కులప్ప, ఎన్. నారాయణరెడ్డి, తిమ్మయ్య, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలోనే అభివృద్ధి: టీడీపీ



చౌడేశ్వరి కాలనీలో కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

హిందూపురం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పడి ఏడాదిలోనే అభివృద్ధి జరిగిందని టీడీపీ నాయకులు అన్నారు. హిందూపురం మండలంలోని ఎం.బీరేపల్లి గ్రామంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలు చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. రానున్న నాలుగేళ్లలో సంక్షేమం, అభివృద్ధి వేగం పుంజుకుంటుందన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తారన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వర్థనారాయణరెడ్డి, కన్వీనర్‌రాము, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆనంద్, నాయకులు ఆదినారాయణ, మంజునాథ్, లోకేష్, ఐటీడీపీ రామాంజి, హనుమంతరాయుడు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా హిందూపురం పట్టణం రెండోవార్డులో జరిగిన తొలిఅడుగు కార్యక్రమంలో కోక్లస్టర్ ఇన్‌చార్జి రవీంద్రనాయుడు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు వివరించారు. కార్యక్రమంలో నాయకులు రవిచంద్ర, బస్సు ప్రసాద్ పాల్గొన్నారు.

● గోరంట్ల పట్టణంలోని 1 వార్డు, టీటీడీ కల్యాణమండపం ప్రాంతంలో మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణి, నాయకులతో కలిసి సుపరిపాలనకు తొలిఅడుగును బుధవారం నిర్వహించారు. ఇంటింటికెళ్లి సంక్షేమపథకాలు వివరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

● పరిగి(ఆంధ్రజ్యోతి): సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని మోదా పంచాయతీలో స్థానిక టీడీపీ నాయకులు నిర్వహించారు. ప్రభుత్వం ఏడాదిపాలనలో చేసిన అభివృద్ధి, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గోవిందరెడ్డి, సర్పంచ్ బాలాజీ, జిల్లా తెలుగు యువత కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సోమప్ప, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఎస్‌కే సంఘం అధ్యక్షుడిగా అనిల్‌కుమార్

పావగడ, జూలై 23(ఆంధ్రజ్యోతి): స్థానిక శనిమహాత్మ కార్యనిర్వాహక సంఘం (ఎస్ఎస్‌కే) అధ్యక్షుడిగా జీఎస్ అనిల్‌కుమార్ బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాజీ మంత్రి వెంకరటమణప్ప, మాజీ అధ్యక్షుడు కేవీ శ్రీనివాస్, ఆనంద్‌రావు, డైరెక్టర్లు వెంకట్రామిరెడ్డి, కౌన్సిలర్లు రాజేష్, రవి, నామిని తదితరులు అభినందించారు.

రొమ్మరహట్టిలో పొలం పిలుస్తోంది

రొళ్ల, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దొమ్మరహట్టి, వడ్రహట్టి గ్రామంలో బుధవారం పొలం పిలుస్తుంది నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా రాయితీతో అందిస్తున్న పరికరాలను అధికారులు రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి వెంకటబ్రహ్మం పాల్గొన్నారు.

ఎరువుల నిల్వకు గుంతలు తీసుకోండి: ఎంపీడీఓ

గోరంట్ల, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ పంట పొలాలకు ఉపయోగించే ఎరువును నిల్వ ఉంచుకోవడానికి ఉపాధి పథకం ద్వారా ఎరువు గుంతలు ఏర్పాటు చేసుకోవచ్చని ఎంపీడీఓ నరేంద్రకుమార్ తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామానికి సమీపంలోని సొంత పొలాల్లో రూ.569లు వ్యయంతో గుంతలు తీసుకోవచ్చన్నారు. గ్రామంలో ఎక్కడబడితే అక్కడ చెత్తకుప్పలు వేయడం వల్ల ప్రజారోగ్యానికి భంగం వాటిల్లుతోందన్నారు. ప్రభుత్వ సహకారంతో గుంతలు తీసి ఎరువును నిల్వ చేసుకోవచ్చన్నారు. ఆసక్తి ఉన్న వారు సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్, కార్యదర్శిని సంప్రదించాలని సూచించారు.

కేరళ మాజీ ముఖ్యమంత్రికి ఘననివాళి

పెనుకొండ, జూలై 23(ఆంధ్రజ్యోతి): కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ మృతికి స్థానిక సీఐటీయూ, సీపీఎం నాయకులు ఘననివాళులు అర్పించారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం నాయకులు హరి, నాయకులు అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఆయన ఆశయాలు కొనసాగించేందుకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాబావలి, తిప్పన్న, నరసింహులు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నుంచి సస్పెండ్ చేశాం: కొల్లకుంట

హిందూపురం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఓ మహిళతో ఫోన్‌లో అసభ్యకరంగా మాట్లాడిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త కగ్గలప్పను పార్టీ నుంచి బుధవారం సస్పెండ్ చేసినట్లు జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప ప్రకటనలో పేర్కొన్నారు. కొద్దిరోజుల క్రితం మహిళతో ఫోన్‌లో అసభ్యకరంగా మాట్లాడిన కగ్గల్లప్పను జరిగిన ఘటనపై వివరణ కోరడం జరిగింది. అయితే ఆయన ఇచ్చిన సమాధానం అసంతృప్తిగా ఉండటంతో పార్టీ క్రమశిక్షణ చర్యల కింద ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సూచనమేరకు సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. అతని సోదరుడు నగేష్‌ను కూడా పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఇద్దరి పార్టీసభ్యత్వాలను రద్దుచేయడం జరిగిందన్నారు. ఎవరైనా మహిళలపట్ల అసభ్యంగా ప్రత్యక్షంగాగాని, ఫోన్‌లోకానీ మాట్లాడితే పార్టీ తీవ్రంగా పరిగణిస్తుందన్నారు. అలాంటివారిని ప్రోత్సహించేదిలేదని ఎంతటివారైనా చర్యలు తీసుకుంటామన్నారు.

కారు.. బొలెరో ఢీ

● ఆరుగురికి స్వల్పగాయాలు

హిందూపురం, జూలై 23(ఆంధ్రజ్యోతి): హిందూపురం-లేపాక్షి ప్రధానరహదారిలో కారు, బొలెరో ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురికి స్వల్పగాయాలైనట్లు అప్‌గ్రేడ్ పోలీసులు తెలిపారు. బుధవారం సాయంత్రం కర్ణాటక చెన్నగిరికి చెందిన పలువురు బొలెరోలో వస్తున్నారు. అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లడంతో అందులో ఉన్న ఆరుగురికి స్వల్పగాయాలయ్యాయి. వీరిని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

దివ్యాంగుల ప్రతిభ అభినందనీయం

● మున్సిపల్ చైర్మన్



ప్రతిభ చాటిన దివ్యాంగ విద్యార్థులతో మున్సిపల్ చైర్మన్ తదితరులు

హిందూపురం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఈ యేడాది పదోతరగతి పరీక్షల్లో దివ్యాంగులు సాధించిన ప్రతిభ అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పీఏ వీరయ్య అన్నారు. బుధవారం ఎంజీఎం పాఠశాల ఆవరణంలో భవిత కేంద్రంలో పదోతరగతిలో చక్కటి ప్రతిభ కనబరచిన దివ్యాంగ విద్యార్థులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్, పీఏ మాట్లాడుతూ దివ్యాంగుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకురావడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా వారికి అవసరమైన వీల్‌చైర్లు, వాకింగ్ స్టిక్స్, వినికిడి యంత్రాలు, దృష్టిలోపం, ఆర్థోకు సంబంధించిన పరికరాలు అందిచడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఏసీపీ దేవరాజు, ఐఈడీ ఆనంద బాబు, ఎంఈఓ గంగప్ప, ప్రసన్న లక్ష్మీ, హెచ్ఎంలు రంగనాయకులు సూర్యనారాయణ, కిష్టప్ప, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.